కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరం

నవతెలంగాణ-మిర్యాలగూడ



కేఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో శీతాకాలపు ప్రత్యేక శిబిరంలో భాగంగా మూడవ రోజు ఆదివారం మండలంలోని యాద్గార్ పల్లి గ్రామంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు వీధులలో కంపచెట్లను తొలగించి రోడ్లకు ఇరువైపులా పరిశుభ్రం చేశారు. గ్రామంలో జరుగుతున్న శీతాకాలపు ప్రత్యేక శిబిరాన్ని మహాత్మా గాంధీ ఎన్ఎస్ఎస్ సెల్ విభాగం జూనియర్ అసిస్టెంట్ రామరాజు హరికిషన్రావు సందర్శించారు. వాలంటీర్స్ సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ యస్ కోటయ్య వాలంటీర్లు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నల్లగొండ
సోమవారం | మార్చి 18, 2024 | www.navatelangana.com

నేటి నుండి పది పరీక్షలు ప్రారంభం

నవతెలంగాణ-వేములపల్లి

నేటి నుండి మండలంలో 10వ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ బాలాజీ నాయక్ ఆదివారం తెలిపారు. మండల పరిధిలో 2 ఎస్ఎస్సి పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, 255 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్షలు పారదర్శకంగా నిర్వహించుటకు రెవెన్యూ, పోలీస్ శాఖల సహకారంతో అన్ని ఏర్పాట్లు చేశామని న్నారు. మార్చి 18 నుండి 30 తేదీ వరకు ఉ.9.30 గ నుండి 12.00 గం ల కొరకు పరీక్షలు నిర్వహించబడతాయన్నారు. ఈ సమయంలో మండల పరిధిలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్లు మూసివేయలన్నారు.విద్యార్థులు 5 నిమిషాల వరకు ఆలస్యంగా వచ్చిన అనుమతిస్తామన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, తల్లిదండ్రులు కౌన్సిలింగ్ నిర్వహించి విద్యార్థులు ఎవరు మానసిక ఒత్తిడికి గురి కాకుండా చూడాలని కోరారు.

అభ్యర్థుల వేటలో గులాబీ దళాలు

- నల్లగొండకు కంచర్ల కృష్ణారెడ్డి..!
- భువనగిరికి భిక్షమయ్య గౌడ్..?
- ఒకట్రెండు రోజుల్లో అధికారిక ప్రకటన



నవతెలంగాణ-నల్లగొండటౌన్

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇప్పటివరకు ఇటు బీఆర్ఎస్కానీ, అటు కాంగ్రెస్ కానీ ఎంపీ అభ్యర్థులను ఖరారు చేయలేదు. తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో అభ్యర్థుల ఖరారులో ఇరుపార్టీలు ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.ఒకటి రెండు రోజుల్లో దీనిపై అధికారిక ప్రకటనకు రంగం సిద్ధమైందని సమాచారం.

భువనగిరికి భిక్షమయ్యగౌడ్ ఖరారు వెనుక....

బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థిగా పలువురి పేర్లు పరిశీలనలోకి వచ్చినట్లు సమాచారం. బి.భిక్షమయ్యగౌడ్, చెరుకు సుధాకర్, బాలరాజ్యాదవ్, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్రెడ్డి, ఆయన తనయుడు ప్రశాంత్రెడ్డి, జనగాం మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిల పేర్లు ప్రముఖంగా పరిశీలనకు వచ్చినట్లు సమాచారం.ఒకదశలో 2001 నుంచి తెలంగాణ ఉద్యమంలో ఉన్న పోచంపల్లి ఎంపీపీ ఎం.ప్రభాకర్రెడ్డి పేరు కూడా తీవ్రంగా పరిశీలనలోకి వచ్చినట్లు తెలుస్తోంది.అయినప్పటికీ నల్లగొండ ఎంపీ రెడ్డి వర్గానికి ఇచ్చి, భువనగిరి కూడా రెడ్డి కమ్యూనిటీకి ఇస్తే బావుండదని కొందరు నాయకులు భావిస్తున్నట్టు సమాచారం.రెండింటిలో ఏదో ఒకటి బీసీలకు కేటాయించాలని ఉమ్మడి నల్లగొండకు చెందిన ఒక సీనియర్ నాయకుడు అధిష్టానానికి సూచించినట్టు తెలిసింది. నల్లగొండ ఎంపీ సీటు బీసీలకు ఇస్తే యాదవులకు ఇవ్వాలని, భువనగిరి ఇవ్వాల్సివస్తే గౌడ కమ్యూనిటీకి ఇవ్వాలని సీనియర్ నేత ప్రతిపాదన తెచ్చినట్టు తెలిసింది.గతంలో నల్లగొండ పార్లమెంట్ పరిధిలో యాదవులకు మంచి అవకాశాలు ఇవ్వడం జరిగిందని, ఒక రాజ్యసభ, రెండు చోట్ల ఎమ్మెల్యేలుగా అవకాశం ఇవ్వడంతో పాటు కార్పొరేషన్ పదవులు కూడా ఇచ్చిన దృష్ట్యా ఈసారి నల్లగొండ స్థానాన్ని రెడ్డి సామాజికవర్గానికి ఇచ్చి, భువనగిరి సీటు బీసీ(గౌడ)లకు ఇవ్వాలన్న స్పష్టతకు బీఆరెస్ అధినేతకు వచ్చినట్టు సమాచారం. ఇక్కడ గౌడ సామాజికవర్గం మద్దతు ఎక్కువగా బీఆర్ఎస్కే ఉందని అధిష్టానం నమ్ముతోంది.దీంతో వారికి టికెట్ ఇవ్వడం సముచితంగా ఉంటుందన్న ఆలోచనకు వచ్చింది. గతంలో ఇక్కడ బూర నర్సయ్యగౌడ్కు బీఆర్ఎస్ అవకాశం ఇచ్చినా, ఆయన పార్టీమారిపోవడంతో భిక్షమయ్యగౌడ్కు భువనగిరి ఎంపీ సీటు ఖరారు చేసినట్టు తెలుస్తోంది. సోమ, మంగళ వారాల్లో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

నల్లగొండకు కంచర్ల పేరు ఖరారు...

నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థిగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్రెడ్డి సోదరుడు కంచర్ల కృష్ణారెడ్డి పేరు దాదాపు ఖరారైనట్టు తెలుస్తోంది.బీఆర్ఎస్ నేత గుత్తా సుఖేందర్రెడ్డి కుమారుడు అమిత్రెడ్డి తాను నల్లగొండ ఎంపీగా పోటీ చేస్తానని పలుమార్లు అభిప్రాయం వెల్లబుచ్చారు. కానీ వారు కాంగ్రెస్లోకి మారుతారనే ప్రచారం నేపథ్యంలో ఆయన పేరును అధిష్టానం సీరియస్గా పరిశీలించలేదని సమాచారం. ఇంకా ఈ స్థానానికి మాజీ ఎంపీ (రాజ్యసభ) బడుగుల లింగయ్యయాదవ్ పేరును అధిష్టానం సీరియస్గా పరిశీలించినా, ఇప్పటికే భువనగిరి సీటు బీసీలకు ఖరారు చేసినందున నల్లగొండ స్థానం కూడా బీసీలకు ఇవ్వడం సరికాదనే అభిప్రాయానికి రావడంతో ఆయన పేరు తప్పించినట్టు తెలుస్తోంది.దీంతో కంచర్ల కృష్ణారెడ్డి, చాడ కిషన్రెడ్డి, అంజయ్య యాదవ్ల పేర్లను అధిష్టానం తీవ్రంగా పరిశీలించింది.ఒక దశలో నల్లగొండ ఎంపీ స్థానానికి గిరిజన అభ్యర్థిని నిలిపితే బావుంటుందనే ప్రతిపాదన వచ్చినట్లు తెలిసింది.ఈ నేపథ్యంలో కంచర్ల కృష్ణారెడ్డిని భువనగిరి ఎంపీగా పోటీ చేయిస్తే నల్లగొండలో యాదవ, ఎస్టీ సామాజికవర్గాలకు అవకాశం ఇవ్వాలని చర్చకు వచ్చినట్టు సమాచారం. అంతిమంగా భువనగిరిలో మాజీ ఎమ్మెల్యే, ప్రజల్లో ఆదరణ ఉన్న బీసీ నేత భిక్షమయ్యగౌడ్ను, మునుగోడు ఎమ్మెల్యే స్థానం కోసం తీవ్రంగా ప్రయత్నం చేసిన కంచర్ల కృష్ణారెడ్డిని నల్లగొండ ఎంపీగా నిలిపితే బావుంటుందనే నిర్ణయానికి పార్టీ అధిష్టానం వచ్చినట్టు విశ్వసనీయ సమాచారం.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

నవతెలంగాణ-నకిరేకల్



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్టెస్టులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆదివారం స్థానిక ఎస్పీఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు.ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్రెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరంతరం విద్యారంగ సమస్యల పట్ల పోరాటాలు నిర్వహించడమే గాక ప్రతి సంవత్సరం 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్, ఇంటర్ విద్యార్థులకు మోడల్ ఎంసెట్ నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు.టెస్ట్లో మండలస్థాయిలో ఎస్పీఆర్ పాఠశాల విద్యార్థులు ఎన్. మనీ సాయి మొదటి బహుమతి, ద్వితీయ బహుమతి ఎన్. జోషిత, తృతీయ బహుమతి ఏవీఎం హైస్కూల్ విద్యార్థి సిరిమహాలక్ష్మి గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నకిరేకల్ డివిజన్ కార్యదర్శి ముస్కు రవీందర్, ఎస్పీఆర్ పాఠశాల కరస్పాండెంట్ బి.కన్నయ్యగౌడ్, పాఠశాలల టీచర్స్ వెంకటేశం, అంజయ్య, శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి కృషి

- టీపీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మధు

నవతెలంగాణ-నల్లగొండకలెక్టరేట్



గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలంగాణ పంచాయతీ సెక్రెటరీ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షునిగా నూతనంగా నియామకమైన కత్తుల మధు అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఎస్బీఆర్ ఫంక్షన్హాల్లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.ప్రొహిబిషనరీ కాలాన్ని సర్వీస్కాలంగా పరి గణించాలని, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేస్తూ ఓపీఎస్ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అంతేగాకుండా పంచాయతీ కార్యదర్శుల వ్యవస్థను రెండు గ్రేడ్లుగా విభజించాలని, ప్రభుత్వం ప్రకటించిన పంచాయతీరాజ్ వ్యవస్థకు సంబంధించిన అన్ని అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు సీతారామాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

నవతెలంగాణ-మిర్యాలగూడ



నేడు (మార్చి 18న) మండలంలోని గూడూరు శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మెన్ దైద సంజీవరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని గూడూరు గ్రామంలో నిర్మించిన శ్రీ సీతా రామాంజనేయ స్వామి దేవస్థానం గణపతి కీర్తి ధ్వజ విగ్రహయంత్ర ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలను సోమవారం వేద పండితులు బ్రహ్మశ్రీ యిస్కిళ్ళ ఆనంద శర్మ, స్థపతి డా పద్మశ్రీ వేలు ఆనందాచారి పర్యవేక్షణలో సోమ, మంగళ, బుధవారాల్లో ఆలయ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. 20వ తేదీన జరిగే విగ్రహ ప్రతిష్ఠ, సీతారాముల కళ్యాణ మహోత్సవం నిర్వహించబడుతుంది. మూడు రోజులు పాటు అత్యంత వైభవోపేతంగా నిర్వహించబడే ఈ కార్యక్రమాలలో భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ అధ్యక్షులు దైద సంజీవరెడ్డి. ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

ప్రజల దాహార్తిని తీరుస్తున్న జమ్జమ్ చలివేంద్రం

నవతెలంగాణ-నాగార్జునసాగర్



ఎండల్లో తిరిగి బేజారువుతున్నా ప్రజలకు, దవాఖానకు వచ్చే రోగుల దాహార్తిని జమ్ జమ్ చలివేంద్రం తీరుస్తోంది. నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని కమలా నెహ్రూ దవాఖాన వద్ద హిల్ కాలానికి చెందిన ఒక ముస్లిం కుటుంబ సభ్యులు ఎంఎస్కె బాబు అండ్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో జమ్జమ్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అదేవిదంగా రంజాన్ పర్వదినం సందర్భంగా ప్రతిరోజు మజ్జిగను అందిస్తున్నారు. గత 10 ఏండ్లుగా వేసవిలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి సేవలందిస్తున్నామని తెలిపారు. చలివేంద్రం ఏర్పాటు చేయడం పట్ల స్థానికుల నుండి అభినందనలు వెలువెత్తుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్.కె బాబు అండ్ ఫ్యామిలీ సభ్యులు జబ్బర్, రియాజుద్దీన్, సైదా సాహెబ్, రెహమాన్ షరీఫ్ స్థానికులు ఉన్నారు.

విద్యార్థులకు పెన్నులు పంపిణీ

నవతెలంగాణ-నార్కట్పల్లి



మండలపరిధిలోని తొండ్లాయి గ్రామానికి చెందిన యువజన నాయకులు బింగి మహేష్ ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో జరిగే పరీక్షల్లో విద్యార్థులు కష్టపడి చదివి, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచిపేరు తేవాలని కోరారు.ఒత్తిడి లేకుండా ఉండి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

యూత్ కాంగ్రెస్ జనరల్ కార్యదర్శిగా పుట్టా రాకేశ్

నవతెలంగాణ-నల్లగొండకలెక్టరేట్



నల్లగొండ జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ కార్యదర్శిగా పుట్ట రాకేష్ ముదిరాజును యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేనరెడ్డి నియమించారు. ఆదివారం నల్లగొండ జిల్లా క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గుమ్మల మోహన్రెడ్డి రాకేష్కు యూత్ కాంగ్రెస్ నాయకుల సమక్షంలో నియామక పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.


నూతన కమిటీ ఎన్నిక

జిల్లా అధ్యక్షులుగా కత్తుల మధు

గౌరవ సలహాదారు తంగెళ్ల ఉపేందర్రెడ్డి, ప్రధాన కార్యదర్శి పూనపాటి నరేష్, కోశాధికారి ఏశబోయిననరేష్, జాయింట్ సెక్రెటరీ బక్కతట్లవెంకన్న, మహిళాఅధ్యక్షులు కోడిరెక్క శైలజ, ఉపాధ్యక్షులుగా ఎస్.అంజయ్య, జీ.వెంకటేష్, పి.వెంకన్న, సీహెచ్.అశోక్, కె.సుజాత, సహాయ కార్యదర్శులుగా సీహెచ్.రమేష్, వి.నవీన్, ఎం.వెంకటేష్, ఎల్.లక్ష్మీ, కె.వెంకటేశ్వర్లు, డివిజనల్ అధ్యక్షులుగా జైహిందర్ (దేవరకొండ), బి.రామకృష్ణ (మిర్యాలగూడ),అశోక్ (నల్గొండ)ను ఎన్నుకున్నారు.

టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్గా వెంకన్నగౌడ్

నవతెలంగాణ-కేతెపల్లి



టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ గా కేతేపల్లి మండలంలోని ఇనుపాముల గ్రామానికి చెందిన చనగాని వెంకన్న గౌడ్కు ఆదివారం నియామకపత్రాన్ని ప్రచార కమిటీ అధ్యక్షుడు శ్రీ మధుయాస్కీగౌడ్ అందజేశారు.ఈ సందర్భంగా వెంకన్నగౌడ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు మధుయాష్కీగౌడ్కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో దుబ్బాక గోపాల్రెడ్డి, జాలె వెంకట్రెడ్డి, ఎర్ర శేఖర్గౌడ్, నగేష్, కడారి బాలకృష్ణ, మనోహర్, పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పార్వో వైరస్ సోకిన కుక్కలతో బెంబేలు

- కుక్కలను నియంత్రించాలని వినతి

నవతెలంగాణ-పెద్దవూర



గ్రామాన్ని రక్షించే గ్రామ సింహాలు ఇప్పుడు ప్రజల పాలిట శాపంగా మారుతున్నాయి. విశ్వాసానికి కేరాఫ్ అడ్రస్గా నిలిచే కుక్కలకు పార్వో వైరస్ సోకి పాల్తీతండా గ్రామ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. గ్రామంలో దాదాపు 30 కుక్కలకు పైగా పార్వో వైరస్ సోకింది. దీంతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. పలు గ్రామాల్లో కుక్కలు గుంపులు గుంపులుగా చేరి అటుగా వెళ్లిన వారిపై కుక్కలు దాడికి పాల్పడుతున్నాయి. దాంతో రాత్రిళ్లు ప్రయాణించాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తోంది. అలాగే.. మండల వ్యాప్తంగా కుక్కల దాడిలో పలువురి ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు మృత్యువాత పడిన ఘటనలు కూడా ఉన్నాయి. గత కొద్ది రోజుల క్రితం కుక్కలు అవుదూడను చీల్చి చంపాయి. ఈ విధంగా కుక్కల దాడిలో గొర్రెలు, లేగ దూడలు మృత్యువాత చెందటంతో పాడిపై ఆధారపడిన రైతులు ఆర్థికంగా నష్ట పోతున్నారు.

-పార్వో వైరస్ అంటే

కుక్కలకు పార్వో అనేది కనైన్ పార్వోవైరస్-2 సీపీవీటు వల్ల వచ్చే రక్తస్రావ గ్యాస్ట్రోఎంటెరిటిస్ యొక్క ఒక రూపం. అయినప్పటికీ, వివిధ జంతువులను ప్రభావితం చేసే ఇతర పార్వోవైరస్లు ఉన్నాయి. మరియు చాలా అరుదుగా సీపీవీటు నవజాత, ముసలి కుక్కపిల్లలకు సోకినట్లయితే గుండె సంబంధిత లక్షణాలను కలిగిస్తుంది. పార్వో వైరస్ సోకితే, చికిత్స చేయకపోతే 2 నుండి 3 రోజులలో చిన్న కుక్కపిల్ల చనిపోవచ్చు. చికిత్స చేసినప్పటికీ కొన్ని కుక్కపిల్లలు ఈ వైరస్కు లొంగిపోతాయి. కానీ కొన్ని కుక్కలకు శరీరంపై బొగ్గలు, చీము, రక్తం కారి ఒక కుక్క నుంచి మరోక కుక్కకు వ్యాపిస్తుంది. అలాంటి కుక్కను కుట్టిన దోమ మనుషులకు కుట్టడం వల్ల వారికీ ఈ వ్యాది సోకుతుంది. ప్రస్తుతం అన్నీ గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. మండలంలోని పాల్తీ తండా గ్రామంలో ఈ వైరస్ వల్ల చాలామంది జ్వరాలు, నొప్పులతో బాధపడుతున్నామని వెంటనే సంభందిత అధికారులు కుక్కలను లేకుండా నియంత్రణ చేయాలని కోరుతున్నారు.



కుక్కల వలనే జ్వరాలు వస్తున్నాయి: పాల్తీ రఘు (పాల్తీ తండా)


మా గ్రామంలో దాదాపు 70 కుక్కలు ఉన్నాయి. అందులో సగానికి పైగా వైరస్ సోకింది. బొబ్బలు, పుండ్లు ఏర్పడి రక్తం, చీము కారుతుంది. కుక్కలను కుట్టిన దోమలు మమ్మలి కుట్టడంతో మాకూ జ్వరాలు, ఒల్లు నొప్పులు వస్తున్నాయి.

కుక్కలను నియంత్రించాలి: నేనావత్ శ్రీను (పాల్తీ తండా)

కుక్కలు మేకలు, గొర్ల పిల్లలను చంపు తున్నాయి. మనుషులపై ముఖ్యంగా చిన్నపిల్లపై ఎగబ డుతున్నాయి. వెహికిల్ మీద వెళ్లే వారిని వేగంగా వెళ్లి గాయాలు చేస్తూన్నాయి. మహిళల వెంట పడుతున్నాయి. ప్రతి క్షణం భయంగా ఉంది సంబంధందిత అధికారులు కుక్కలను నియంత్రణ చేయాలి.

కాంగ్రెస్ మండల అధ్యక్షునికి సన్మానం

నవతెలంగాణ-మర్రిగూడ



కాంగ్రెస్ నూతన మండల అధ్యక్షునిగా ఎన్నికైన రాందాస్ శ్రీనివాసును ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బేత వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ వెంకటపేట బాలయ్య, సత్తిరెడ్డి, జమ్ముల వెంకటేష్,మాధగోని శ్రీను, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు యువకులు ముందుండాలి

నవతెలంగాణ-మిర్యాలగూడ



వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడంలో యువజనులు ముందుండాలని నియోజకవర్గ యువజన కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ఇమ్రాన్ షేక్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ ముందుండి నల్గొండ పార్లమెంట్ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. నియోజకవర్గంలో భారీ మెజార్టీ దిశగా ముందుకు సాగాలని కోరారు. యువజన కాంగ్రెస్ సైనికులు ప్రతి వాడలో ప్రతి గ్రామంలో గడపగడపకు వెళ్లి డోర్ టు డోర్ కంపెనీ చేస్తూ 6 గారెంటీల గురించి వివరించాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో దామరచర్ల మండల యువజన కాంగ్రెస్ ప్రెసిడెంట్ మాలోతు శివకుమార్, తడక మల్ల యువజన కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్ కిషోర్, మిర్యాలగూడ యువజన కాంగ్రెస్ నాయకులు అజయ్ కుమార్, టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కుక్కల సురేష్, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


'ఏబీసీడబ్ల్యూఓపై విచారణ జరపాలి'

నవతెలంగాణ-మిర్యాలగూడ

ఏబీసీడబ్ల్యూఓపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర సైదా నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని వెనుక బడిన తరగతుల సంక్షేమ ఆస్తుల వర్తలు విషయంలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరిపించాలని కోరారు. జిల్లాలోని బీసీ సంక్షేమ హాస్టల్లో వర్కర్ల సమస్య విపరీతంగా ఉందని విద్యార్థుల సంఖ్య ఉన్న హాస్టల్లో వర్కర్ల అవసరం ఉందని చాలాసార్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లమని తెలిపారు. 62 మంది వర్కర్ల వద్ద లక్షల రూపాయలు చేతులు మారాయని అవినీతిపై విచారణ జరిపించి జిల్లా అధికారి పై చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్కర్లను నియమించిన సమయంలో ఏజెన్సీ గోపాల్ రెడ్డి తీసుకున్నాడని ఆరోపించారు. అవినీతిపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు జగన్ నాయకులు వదుద్, శివ, ముని పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-నకిరేకల్



మండలంలోని మంగళపల్లి గ్రామం నిరుపేద కుటుంబానికి చెందిన చిలుముల నరేష్ కోచింగ్ నిమిత్తం బీజీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మెన్ బచ్చుపల్లి గంగాధర్రావు ఆదివారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ మాట్లాడుతూ కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలించక ఇబ్బందులు పడుతున్న నరేష్ లాంటి యువతకు తన వంతు ఆర్థికసాయం చేయడానికి ముందుంటానన్నారు.ఆయన వెంట బీజీఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు ఉన్నారు.

ఏబీసీడబ్ల్యూఓను సస్పెండ్ చేయాలి: ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-దేవరకొండ




నల్గొండ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ హాస్టల్లో వర్కర్ల విషయంలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరిపి ఏబీసీడబ్ల్యూఓ అధికారిని సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో బీసీ సంక్షేమ హాస్టల్లో వర్కర్ల సమస్య తీవ్రంగా ఉందని హాస్టల్ ల విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న హాస్టల్లో వర్కర్లు కావాలని పలుమార్లు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. ఈ మధ్యకాలంలో 62 మంది నూతన వర్కర్లను నియమించి ఒక్కొక్కరి దగ్గర నుంచి ఏబిసిడబ్ల్యూఓ అధికారి, ఏజెన్సీ గోపాల్ రెడ్డి లక్ష రూపాయలు వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపించారు. అవినీతి అక్రమాలపై వెంటనే విచారణ చేపట్టి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చేతులు మారిన డబ్బులను రికవరీ చేయాలని, లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ దున్న రవి, తరుణ్, ఆంజనేయులు, ముత్యం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కుమ్మర్లకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

- ఎమ్మెల్యే బాలునాయక్కు వినతి


నవతెలంగాణ-కొండమల్లేపల్లి



రాష్ట్రంలోని కుమ్మరులను గుర్తించి కార్పొరేషన్ నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కోరుతూ ఆదివారం కుమ్మర్ల సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వానికి రాసిన వినతి పత్రం లేఖను దేవరకొండలో ఎమ్మెల్యే నేనవత్ బలునాయక్కి అందజేశారు. ఈ సందర్భంగా కొండమల్లేపల్లి వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 75 ఏండ్ల పరిపాలనలో రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మార్ల సమస్యలను పష్కరించడంలో విఫలం అయ్యాయన్నారు. కుమ్మరులను గుర్తించి కార్పొరేషన్ నామినేటెడ్ పదవులు గుడిలోని కుమ్మర పూజర్లకు గౌరవ వేతనం రూ.4 వేలు ఫెన్షన్ ఇచ్చే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని యమ్మెలే నేనవత్ బాలునాయక్ను కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కుమ్మరసంగం నాయకులు నియోజకవర్గ అధ్యక్షులు తోటపల్లి కిరణ్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బొడ్డుపల్లి సైదుల్, రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షులు ఎల్మినేటి సాయి, కొండమల్లేపల్లి మండల అధ్యక్షులు ఎరుకొండ రాము, మాజీ ఎంపిటిసి ఘనపురం వెంకటయ్య, మాడగుల యాదగిరి, బొడ్డుపల్లి శంకర్, జి .యాదగిరి, తోటపల్లి వెంకటయ్య, శ్రీను, మల్లేశం,బి.వెంకటయ్య, ఎరుకొండ తిరుపతయ్య, సైదులు, తదితర కుమ్మర సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-చిట్యాలటౌన్



చిట్యాల మండలంలోని వెలిమినేడు గ్రామానికి చెందిన ఆనగంటి కృష్ణారెడ్డి అనారోగ్యంతో మరణించగా ఆయన దశదినకర్మకు కాంగ్రెస్ నాయకులు అంతటి పారిజాతనర్సింహగౌడ్ ఆదివారం పాల్గొని రూ.5వేల ఆర్థికసాయం అ ందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు సుర్కంటిసత్తిరెడ్డి, నాయకులు చిరగోని శ్రీశైలం, చీమల వీరేశం,ఏనుగు సుధాకర్రెడ్డి,మారగోని యాదయ్య, ఆరూరు నర్సింహ, కాటం సత్తయ్య, జనగాంసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి కార్యక్రమం రద్దు

• కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్



జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు నేపథ్యంలో జిల్లాలో కోడ్ అమలులో ఉన్నందున, జిల్లా అధికారులు ఎన్నికల విధుల్లో పాల్గొనున్నారని,ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

చెక్‌పోస్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

• ఆర్డీవో సూర్యనారాయణ

నవతెలంగాణ-కోదాడరూరల్



రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ ఆర్.సూర్య నారాయణ అధికారులకు సూచించారు. ఆదివారం మండలపరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్ వద్ద చెక్‌పోస్టును పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుండి మద్యం డబ్బు ,అక్రమంగా రవాణా కాకుండా ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలన్నారు.ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా వ్యాపారాలు చేపడితే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు.తనిఖీ బృందాల నిరంతర నిఘా ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో రెవెన్యూ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆపరేటర్ల తప్పులు..గృహజ్యోతికి తిప్పలు

• అర్హత ఉన్నా అందని జీరో విద్యుత్ బిల్లు

• పథకానికి దూరమైన లబ్దిదారులు

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

ఆపరేటర్ల తప్పిదాలతో గృహజ్యోతి పథకానికి అర్హులైన లబ్దిదారుల ఆన్‌లైన్ నమోదులో జరిగిన పొరపాటు వలన జిల్లాలో వందలాది మంది గృహజ్యోతి పథకం పొందలేకపోయారు.అన్నీ అర్హతలు ఉన్న జీరో విద్యుత్ బిల్లుకు బదులు వందల రూపాయల బిల్లులు చేతికి అందడంతో అయోమయానికి లబ్దిదారులు గురయ్యారు. ఇదేంటని విద్యుత్ సిబ్బందిని ప్రశ్నిస్తే మరోసారి అప్లై చేసుకోవాలని సమాధానం చెబుతున్నారు.దీంతో లబ్దిదారులు జీరాక్స్ పేపర్లతో ప్రజాపాలన సేవా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు.కానీ సేవా కేంద్రాలలో ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతో మేము ఏమి చేయలేమని ఆపరేటర్లు చెబుతున్నారు.వివిధ కారణాలతో గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోలేని వారి పరిస్థితి కూడా ఇలానే ఉంది.

జిల్లాలో 2,75,272 గృహజ్యోతి దరఖాస్తులు..

తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రజాపాలన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.జిల్లాలో 475 పంచాయతీలు, 5 మున్సిపాలిటీలలోని 141 వార్డులలో గ్రామసభలు నిర్వహించి అభయహస్తం పేరున అర్హులైన వారి నుంచి దరఖాస్తులు సేకరించారు. ఇందులో భాగంగా గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ కోసం జిల్లాలో 2,75,272 మంది దరఖాస్తులు చేసుకున్నారు.అలా వచ్చిన దరఖాస్తులను ఆపరేటర్లను నియమించి ఆన్‌లైన్‌లో పొందుపరిచారు.

పథకానికి దూరమైన అర్హులైన లబ్దిదారులు..

మార్చి నుంచి గృహజ్యోతి అథకం అమలులోకి రాగా ఈ నెల ఒకటో తారీకు నుంచి విద్యుత్ సిబ్బంది కరెంట్ బిల్లులను ప్రజలకు అందజేస్తున్నారు. అయితే గృహజ్యోతి పథకానికి దరఖాస్తులు చేసుకున్న చాలా మంది 200 యూనిట్లలోపే విద్యుత్ వాడుతున్నప్పటికీ జీరో బిల్లులు మాత్రం రావడం లేదు.జిల్లాలో 2,75,272 మంది గృహజ్యోతికి దరఖాస్తు చేసుకుంటే కేవలం 1.45 లక్షల మంది మాత్రమే అర్హులని అధికారులు అంటున్నారు.దీంతో జీరో బిల్లు అని చెప్పి వందల రూపాయల బిల్లు చేతిలో పెట్టడంతో అయోమయంలో లబ్దిదారులు ఉన్నారు. జిల్లాలో ఇప్పటికే విద్యుత్ బిల్లుల అందజేయగా,ఇందులో 25 నుంచి 30 శాతం మంది ఉచిత విద్యుత్‌కు అర్హులైనప్పటికీ జీరో బిల్లుకు దూరమయ్యారు.దీంతో తాము దరఖాస్తులు చేసుకున్నప్పటికి ఎందుకు జీరో బిల్లులు ఇవ్వడం లేదని విద్యుత్ సిబ్బందిపై లబ్దిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆన్‌లైన్ నమోదులో తప్పులు..

గ్రామపంచాయతీలు,మున్సిపాలిటీల్లో తీసుకున్న ప్రజాపాలన దరఖాస్తులను



ప్రయివేట్ ఆపరేటర్లను నియమించి వారి ద్వారా ఆన్‌లైన్ చేశారు.ఇందులో చాలా మందికి సరైన అనుభవం లేకపోవడంతో దరఖాస్తుదారుల పేర్లు,మీటర్ నెంబర్,తెల్లరేషన్‌కార్డు,ఆధార్ నెంబర్లను తప్పుగా ఎంటర్ చేశారు.అలాగే ఒక్కో గ్రామంలో,వీధిలో ఒక్కో విధంగా ప్రజాపాలన దరఖాస్తుకు నెంబర్లను ఇవ్వడం జరిగింది.ఈ దరఖాస్తులు నేరుగా విద్యుత్ సంస్థల చేతికి వెళ్లడంతో వారు కూడా తప్పులను సరిచేయకుండానే నమోదు చేశారు.దీంతో చాలా మంది అర్హులైన లబ్దిదారులు ఆపరేటర్లు చేసిన తప్పిదానికి గృహజ్యోతి పథకానికి దూరమయ్యారు.

మండల,మున్సిపాలిటీలలో ప్రభుత్వ సేవా కేంద్రాలు ఏర్పాటు...

ప్రజాపాలన అప్లికేషన్లకు సంబంధించి ప్రతి మండలం, మున్సిపాలిటీలలో ప్రభుత్వ సేవా కేంద్రాలను ఓపెన్ చేసింది.మండలాల్లో అయితే ఎంపీడీవో కార్యాలయం, మున్సిపాలిటీలో ఈ సెంటర్లను ప్రారంభించారు.ఒక్కో కార్యాలయంలో ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లకు బాధ్యతలు అప్పజెప్పారు.ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న చాలా మంది లబ్దిదారులకు జీరో బిల్లు రాకపోవడంతో పదిహేను రోజులుగా వందలాది మంది ఈ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.అయితే సేవా కేంద్రాలలో గతంలో చేసుకున్న దరఖాస్తులో విద్యుత్ సర్వీస్(మీటర్ నెంబర్), ఆధార్ నెంబర్, రేషన్‌కార్డు నెంబర్ తప్పుగా పడితే సరిచేసే అవకాశం ఇచ్చారు.కానీ గతంలో కొన్ని కారణాలతో 200 యూనిట్లకు దరఖాస్తులు చేసుకోకుండా ఉన్నవారు, లేక ఆపరేటర్ల తప్పుతో సర్వీస్ నెంబర్, లేదు అని నమోదు చేసిన వారికి సరిదిద్దే ఆప్షన్ ఇవ్వలేదు. ఒకవేళ కొత్తగా అప్లికేషన్ నమోదు చేయడానికి ప్రయత్నిస్తే ఆధార్, రేషన్‌కార్డ్, మొబైల్ నెంబర్ ఆధారంగా గతంలోనే ఎంటర్ చేసినట్లు చూపిస్తుంది.దీంతో గతంలో ఆపరేటర్ల తప్పిదంతో గృహజ్యోతి పథకంలో నమోదు కాని వారికి,ఇతర పథకాలకు దరఖాస్తు చేసుకొని,గృహజ్యోతికి నమోదు చేయని వారికి సరిదిద్దే ఆప్షన్ లేకపోవడంతో అర్హత కలిగిఉన్న దరఖాస్తు చేసుకోలేక పోతున్నారు. అర్హత ఉండి దరఖాస్తులు చేసుకునేలా ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలని ప్రజలు,లబ్దిదారులు కోరుతున్నారు.

తాటిచెట్టుపై నుండి కింద జారిపడి గీత కార్మికుడు మృతి

నవతెలంగాణ-తిరుమలగిరి

తాటిచెట్టుపై నుండి ప్రమాదవశాత్తు జారి కింద పడి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన ఆదివారం తిరుమలగిరి మండలం గుండెపురి గ్రామంలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన ప్రకారం.. గుండెపురి గ్రామానికి చెందిన గీత కార్మికుడు పాలకుర్తి వెంకన్న ప్రతిరోజు మాదిరిగానే తాటిచెట్టు ఎక్కడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుడు వెంకన్నకు ఒక కుమార్తె. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు తిరుమలగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తూ శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ఏరియాస్పత్రికి తరలించారు.వెంకన్న మృతితో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.మృతిని కుమార్తెకు ఈనెల 18 నుండి 10వ తరగతి పరీక్షలు రాయాల్సి ఉంది.



20న అన్నప్రసాద వితరణ

నవతెలంగాణ-కోదాడరూరల్

పట్టణంలో పునర్నిర్మాణం గావించుకుని కోదండ రామాలయంలో పలు దేవతా విగ్రహాలను ప్రతిష్ఠించనున్న నేపథ్యంలో ఈ నెల 20న పట్టణంలోని పలు ప్రాంతాలలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ప్రతిష్ఠ నిర్వాహక కమిటీ సభ్యులు పైడిమర్రి నారాయణరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.పట్టణంలోని హుజూర్‌నగర్‌రోడ్డులో గల టీటీడీ కల్యాణమండపంలో, శ్రీమన్నారాయణ కాలనీలో కట్టకమ్మగూడెం రోడ్డు లోగల పెరిక హాస్టల్‌లో,సూర్యాపేట రోడ్డు లోపల కాశీనాథం ఫంక్షన్‌హాల్‌లో, ప్రధాన రహదారిపై గల బాలుర ఉన్నత పాఠశాలలో, గుడిబండ రోడ్డులో గల గుడుగుంట్ల అప్పయ్య ఫంక్షన్‌హాల్‌లో, నాగుబండిరామ్మూర్తి నగర్‌లో గల యాగశాల ఆవరణలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించ నున్నట్టు తెలిపారు. పట్టణ పరిసర ప్రాంత భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మెన్‌ను కలిసిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు

నవతెలంగాణ-నాగారం



రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మెన్‌గా ఎంఏ.ఫహీంబాయ్ నియమితులైన నేపథ్యంలో కాంగ్రెస్ మండల నాయకులు చిత్తలూరి ఉపేం దర్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు.ఆదివారం ఆయన ఫహీంబాయ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. పార్టీ కోసం ఎంతో శ్రమించిన ఫహీంబాయ్‌కు ఫుడ్ కార్పొరేషన్ చైర్మెన్ రావడం చాలా సంతోషకరమన్నారు.

'డిజిటల్ లావాదేవీలు ఉత్తమం'

నవతెలంగాణ-నాగారం

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రజలందరూ డిజిటల్ లావాదేవీలు ఉత్తమమని ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ లీడర్ దారా శ్రీనివాస్ అన్నారు.ఆదివారం నాగారం మండలకేంద్రంలో జనగాం సూర్యాపేట ప్రధాన రహదారిపై వచ్చే పోయే వాహనాలను ఆయన ఎన్నికల కోడ్ దృష్ట్యా తనిఖీ చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు రూ.10వేలకు మించి డబ్బును నగదు రూపంలో తీసుకెళ్లకూడదని సూచించారు.ఒకవేళ తీసుకెళ్లినా దానికి సంబంధించిన పూర్తి ఆధారాలు ఉండాలని పేర్కొన్నారు.బంగారం, వెండి ఆభరణాలు విలువైన వస్తువులు తీసుకెళ్లొద్దన్నారు.ఒకవేళ తీసుకెళ్లినట్టయితే జిల్లాస్థాయిలో కమిటీ ఉంటుందని, ఆ కమిటీ దగ్గరికి వెళ్లి ప్రజలు సరైన ఆధారాలు చూపించి పొంద వచ్చన్నారు.ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి 'పది' పరీక్షలు

• జిల్లా వ్యాప్తంగా 67 పరీక్షాకేంద్రాలు

• టెన్త్ పరీక్షలకు హాజరుకానున్న 11,946 మంది రెగ్యులర్ విద్యార్థులు,187 మంది సప్లమెంటరీ విద్యార్థులు

• పరీక్షాకేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

నవతెలంగాణ-తుంగతుర్తి

ఈనెల 18 నుండి ఏప్రిల్ 2 వరకు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి.ఈ మేరకు జిల్లా అధికారులు అన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు.జిల్లావ్యాప్తంగా 67 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేయగా అందులో 35 పరీక్షాకేంద్రాలు ప్రయివేట్ పాఠశాలల్లో, 32 పరీక్షాకేంద్రాలు ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేశారు.ఈ కేంద్రాలలో 11,946 మంది రెగ్యులర్ విద్యార్థులు, 187 మంది సప్లిమెంటరీ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు.విద్యార్థులు పరీక్షాకేంద్రాలకు సకాలంలో చేరుకునేలా అధికారులు ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో హాల్ టికెట్ చూపించి ఉచితంగా ప్రయాణం చేయవచ్చని తెలిపారు.పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సదుపాయం, వైద్య సిబ్బందిని ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ప్రతి పరీక్షాకేంద్రం నుండి 100 మీటర్ల వరకు పోలీసు బందోబస్తుతో పాటు 144 సెక్షన్ అమలు చేయడం జరుగుతుందని,పరీక్షలు జరుగుతున్న సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని తెలిపారు.పరీక్షలు ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు.విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు గంట ముందుగానే చేరుకోవాలని,9:35 దాటితే పరీక్షా కేంద్రాల్లోనికి అనుమతించరని తెలిపారు.

ఇన్విజిలేటర్లు విద్యార్థులు పాటించాల్సిన నియమాలు

పరీక్షా కేంద్రాలలో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఫొటో ఐడీ కార్డు ధరించాలని,అదేవిధంగా ప్రతి విద్యార్థి హాల్‌టికెట్‌తో పరీక్షకు హాజరుకావాలని సూచించారు.ప్రతి విద్యార్థి ప్రశ్నాపత్రంపై తప్పనిసరిగా హాల్‌టికెట్ నెంబర్ రాయాలని,జవాబు పత్రంపై ఎక్కడ కూడా హాల్‌టికెట్ నెంబర్లు రాయవద్దని సూచించారు.సెల్ ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షాకేంద్రాలలోనికి తీసుకురాకూడదని పరీక్షా సమయం పూర్తయ్యే వరకు విద్యార్థులు సిబ్బంది పరీక్షాకేంద్రాన్ని విడిచి వెళ్ళకూడదని సూచించారు.



పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం

జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలను తీసుకుందని జిల్లా విద్యాశాఖ అధికారి కె.అశోక్ తెలిపారు.జిల్లావ్యాప్తంగా అన్ని పరీక్షాకేంద్రాలలో సీసీకెమెరాల నిఘాలో ప్రశ్నాపత్రాలను తెరిచేలా ఏర్పాటు చేశామని తెలిపారు.ఈ సంవత్సరం సైన్స్ విభాగానికి రెండు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని 1.భౌతిక రసాయన శాస్త్రం 2.జీవశాస్త్రం తెలిపారు.జిల్లావ్యాప్తంగా 67 పరీక్షా కేంద్రాలలో 67 మంది చీఫ్ సూపర్డెంట్లు 67 మంది డిపార్టుమెంటల్ అధికారులు 740 మంది ఇన్విజిలేటర్లు 4 ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు.జిల్లా స్థాయిలో హెల్ప్‌లైన్ నెంబర్లుగా జిల్లా విద్యాశాఖ అధికారి 7995087629 కంట్రోల్ రూమ్ నెంబర్ పరీక్షల కమిషనర్ 9848809754 సంప్రదించాలని సూచించారు. మండలస్థాయిలో మండల విద్యాశాఖ అధికారిని సంప్రదించాలని సూచించారు.

మౌలికవసతుల కల్పనకు పెద్దపీట

నవతెలంగాణ-పాలకవీడు



మండలంలోని పలు గిరిజన గ్రామాల రహదారుల నిర్మాణాలకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రూ.6.50 కోట్లు మంజూరు చేశారని పాలకవీడు ఎంపీపీ భూక్యా గోపాల్, జెడ్పీటీసీ మాలోతు బుజ్జి మోతిలాల్‌నాయక్, కాంగ్రెస్ మండలఅధ్యక్షుడు ఎస్‌పీ. సుబ్బారావు లు తెలిపారు. ఆదివారం పాలకవీడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బెట్టే తండా గ్రామం నుండి శూన్య పాడు గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3.5 కోట్లు , మూసి ఒడ్డు సింగారం గ్రామం నుండి రోడ్ల వారి గూడెం గ్రామానికి రూ.1.80 కోట్లు, రాఘవాపురం గ్రామం నుండి అలింగాపురం వరకు రూ.కోటి, బెట్టె తండా గ్రామం నుండి మూసి నదికి వెళ్లే రహదారిలో కల్వర్టు నిర్మాణానికి రూ.10 లక్షలు, మూసి ఒడ్డు సింగారం గ్రామం నుండి రోళ్ళవారిగూడెం గ్రామానికి వెళ్లే రహదారిలో కల్వర్టు నిర్మాణానికి రూ.10 లక్షలు కలుపుకొని మొత్తం రూ.6.5 కోట్లు మంజూరు చేశారన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి ఇప్పటివరకు రూ.10కోట్లకు పైగా మంజూరు చేశారని వెల్లడించారు. నిర్మాణాలు పూర్తయితే పాలకవీడు మండలంలోని దాదాపు అన్ని రహదారులు అద్దాల్లా మెరుస్తాయన్నారు.మండల అభివృద్ధికి సహకరిస్తున్న మంత్రి ఉత్తమ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు మాలోతు మోతిలాల్‌నాయక్, పాలకవీడు, శూన్యపాడు ఎంపీటీసీలు మీసాల ఉపేందర్, కవితనీమానాయక్, నాయకులు సైదానాయక్ పాల్గొన్నారు.

తాటిచెట్టుపై నుండి కింద పడ్డ గీత కార్మికుడు

నవతెలంగాణ-ఆత్మకూర్‌ఎస్

మండలంలో తుమ్మలపెన్‌పహాడ్ గ్రామానికిచెందిన యరగాని వెంకన్న (54) గీత కార్మికుడు రోజు మాదిరిగానే శనివారం రాత్రి తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు మోకు జారి కింద పడడంతో మెడనరాలు దెబ్బ తినడం వల్ల కాళ్ళు, చేతులు కదలడం లేదు.పైకి లేవడం లేవు. ప్రమాదకరంగా మారి అక్కడక్కడ బలమైన గాయాలు తగిలి స్పృహ కోల్పోవడంతో 108 ద్వారా సూర్యాపేట హాస్పిటల్ తరలించగా సీరియస్‌గా ఉండడంతో హైదరాబాద్ ప్రయివేట్‌హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ప్రభుత్వం నుండి ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలు ఇవ్వాలని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబు,జిల్లా ఉపాధ్యక్షులు అబ్బగాని భిక్షం,జిల్లా కమిటీ సభ్యుడు,సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తండ రమేశ్,మండల అధ్యక్షుడు ,కార్యదర్శి నోముల వెంకన్న, బెల్లంకొండ ఇస్తారి, సొసైటీ అధ్యక్షులు కాట్ల వెంకన్న డిమాండ్ చేశారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్,ప్యాడ్లు పంపిణీ

నవతెలంగాణ-ఆత్మకూరుఎస్

మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షకు సంబంధించిన స్టడీ మెటీరియల్,ప్యాడ్లు,పెన్నులను మేడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు.అనంతరం మేడి ఫౌండేషన్ చైర్మెన్ మేడి కృష్ణ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు బహుమతి అందజేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బొడ్డు మహేష్, శ్రీనాథ్,నవీన్, మురళి ,థామస్,రాజేశ్, చంద్రతేజ, ఉమేష్, భరత్, చరణ్, తేజ తదితరులు పాల్గొన్నారు.

'భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమిద్దాం'

నవతెలంగాణ-ఆత్మకూరు ఎస్

భగత్‌సింగ్,రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో యువత యువజన పోరాటాలను ఉధృతం చేయాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షులు నల్లగొండనాగయ్య అన్నారు.ఆదివారం మండలంలోని గురుకుల జ్యోతిరావుపూలే బీసీ వెల్ఫేర్‌లో పీడీఎస్‌యూ,పీవైఎల్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి సందర్భంగా సభను పీవైఎల్ జిల్లా కోశాధికారి బండి రవి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్,రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లు బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, భారతదేశ విముక్తి కోసం, స్వేచ్ఛాస్వాతంత్ర్యం కోసం తమ విలువైన ప్రాణాలను భారత జాతికి అంకితం ఇచ్చారన్నారు.ఉరితాడును ముద్దాడి అమరులయ్యారన్నారు.అమెరికా, రష్యా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు.దేశంలో రోజురోజుకీ మతోన్మాదం, ఫాసిజం పెరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో విఫలమయ్యారన్నారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు పిడమర్తి భరత్, రమేశ్, కుంట రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

నవతెలంగాణ-నూతనకల్

రానున్న పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలలోకి వచ్చిందని ప్రతి ఒక్క రాజకీయ నాయకులు ఎన్నికల నియమనిబంధనలో పాటించాలని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీటీవో సునీత వివిధ పార్టీల రాజకీయ నాయకులకు సూచించారు. ఆదివారం మండలకేంద్రంలో ఉన్న ఫ్లెక్సీ బ్యానర్లతో పాటు వివిధ గోడ పత్రికలను గ్రామపంచాయతీ సిబ్బందితో తొలగించారు. గోడలపై ఉన్న రాతలను సైతం తొలగించాలని ఎన్నికల ముగిసే అంతవరకు ఎన్నికల నిబంధనల కోడ్ ఉంటుందని, ప్రతిఒక్కరూ కోడ్‌కు లోబడి ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

రూ.5 వేలు స్వాధీనం

నవతెలంగాణ-పెన్ పహాడ్

ఆరుగురు పేకాటరాయుళ్లను వారిని అరెస్టు చేసిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది.ఎస్ఐ పెరిక రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని మాచారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం అందడంతో పోలీసులు వెళ్లగా, విషయం గమనించిన పేకాట రాయుళ్లు పరుగులు తీయడంతో పోలీసులు చాకచక్యంగా వెంటాడి పట్టుకున్నారు.వీరి నుంచి రూ.5 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-పెన్‌పహాడ్

రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుంచి ఏప్రిల్ రెండవ తేదీ వరకు వరకు నిర్వహించనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు మండలవ్యాప్తంగా పదవ తరగతి విద్యార్థులకు మండల కేంద్రంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారి ఎస్.రవి ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 230 మంది విద్యార్థులు, ప్రాథమిక పాఠశాలలో 95 మంది మొత్తం 325 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని, రెండు పరీక్షాకేంద్రాలలో 17 మంది ఇన్విజిలేటర్లు, ఇద్దరూ చీఫ్ సూపరింటెండెంట్లు,ఇద్దరు డిపార్టెంట్ల అధికారులు, ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్లు, పరీక్షల విధుల కోసం కేటాయించామన్నారు.ఈరెండు కేంద్రాలలో సీసీ కెమెరాలు, సరిపోను బెంచీలు, మంచినీటి సౌకర్యం, విద్యుత్, టాయిలెట్ సౌకర్యం కల్పించినట్లు, గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో పరిశుభ్రంగా చేయించడం జరిగిందని, నేటి నుండి రెండు పరీక్షాకేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. అలాగే జిరాక్స్ సెంటర్‌లను మూసివేయమని కోరామన్నారు.రెండు పరీక్షాకేంద్రాలను తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, ఎంపిడిఓ వెంకటేశ్వర్ రావు అధికారులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు.మండలవ్యాప్తంగా ఉన్న 11 ఉన్నత పాఠశాలల నుండి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

మునగాల:కోదాడ డివిజన్‌లోని మునగాల, కోదాడ,అనంతగిరి, చిలుకూరు, నడిగూడెం మండలాల్లో సోమవారం నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్టు ఆయా మండలాల విద్యాధికారి సలీం షరీఫ్ తెలిపారు.ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. డివిజన్‌లోని ఐదు మండలాల్లో 17 సెంటర్లలో మొత్తం 3285 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్టు తెలిపారు.వీరిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 1715,కాగా ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు 1570 ఉన్నట్లు చెప్పారు. మండలాల వారీగా కోదాడ మండలంలో 17 ప్రభుత్వ పాఠ శాలలు 26 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయన్నారు.ఇందులో ప్రభుత్వ పాఠశాలల నుండి 656 మంది విద్యార్థులు, ప్రై వేట్ పాఠశాలల నుండి1442 విద్యార్థు లు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపా రు.ఇక్కడ10 పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అనంతగిరి మండలంలో ఏడు ప్రభుత్వ పాఠశాలల నుండి 197 మంది విద్యార్థులు పరీక్షకు హా జరుకానున్నట్లు తెలిపారు.అనంతగిరి మండలంలో ప్రభుత్వ పాఠశాలకు చెందిన సగం మంది త్రిపురవరం సెంటర్‌లోనూ మిగతా వారు కోదాడ సెంటర్లలో పరీక్షకు హాజరుకానున్నట్టు తెలిపారు. నడిగూడెం మండలంలో 11 ప్రభుత్వ పాఠశాలలు ఒక ప్రయివేట్


మునగాలలో...

పాఠశాల ఉన్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల నుండి 310 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల నుండి ఆరుగురు విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్టు తెలిపారు. నడిగూడెంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏ ర్పాటు చేసినట్లు తెలిపారు. మునగాల మండలంలో 11 ప్రభుత్వ పాఠశాలలు 4 ప్రైవేట్ పాఠశాలల ఉన్నాయని ప్ర భుత్వ పాఠశాలల నుండి 297 మంది విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలల నుండి 54 మంది విద్యార్థులు పరీక్షలకు హాజ రు కానునట్లు తెలిపారు. మునగాలలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసిన ట్లు చెప్పారు. చిలుకూరు మండలంలో ఎనిమిది ప్రభుత్వ పాఠశాలలు ఒకటి ప్రైవేట్ పాఠశాల ఉందని ప్రభుత్వ పాఠశాలల నుండి 255 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల నుండి 68 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. చిలుకూరు మండలంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ప్రతి పరీక్ష కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టెంట్ అధికారి ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను నియామకం చేసినట్టు తెలి పారు. పరీక్షాకేంద్రాల్లో ఎవరికీ సెల్‌ఫోన్ అనుమతి లేదని అధికారులకు కూడా సెల్‌ఫోన్ అనుమతి లేదని చెప్పారు.విద్యార్థులు భయాందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షా కే ద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో వుంటుందన్నారు.

నేరేడుచర్ల: నేరేడుచర్ల మండలంలో (3) ఎస్సెస్సీ పరీక్షా కేంద్రాలు జెడ్పీహెచ్‌ఎస్ నేరేడుచర్ల,. ప్రగతి విద్యాలయం, శ్రీవాణి ఇంగ్లీష్ మీడియం కేంద్రాలలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామనిఎంఈఓ చత్రునాయక్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరేడుచర్ల సెంటర్‌లో 230 , ప్రగతి విద్యాలయంలో 220 , శ్రీవాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 189 మంది విద్యార్థులు తేది 18 /3 /2024 నుండి 2/4/ 2024 వరకు పరీక్షలు రాయన్నట్లు తెలిపారు. ఈ మూడు సెంటర్లకు ముగ్గురు సీఎస్,ముగ్గురు డిపార్మెంట్ ఆఫీసర్లు ,ముగ్గురు సీటింగ్స్ స్క్వాడ్, హెల్త్ సిబ్బంది మూడు సెంటర్లను కలిపి 39 మంది ఇన్విజిలేటర్లను నియామకం జరిగిందన్నారు.అదేవిధంగా విద్యార్థులు పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా, రాయడానికి అన్ని ఏర్పాట్లను పరిశీలించారు.ఈ పరీక్షలు ఉదయం 9 గంటల 30 నిమిషాల నుండి 12:30 వరకు నిర్వహించబడతాయన్నారు.చీఫ్ సూపరింటెండెంట్,మధు,సువర్ణ కనకయ్యలను నియమించినట్లు తెలిపారు.

హుజూర్‌నగర్: మండలకేంద్రంలో పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓ సైదానాయక్ తెలిపారు.ఈనెల 18 నుండి పరీక్షలు ప్రారంభంకానున్నాయని పట్టణంలోని ప్రభుత్వ హై స్కూల్ కృష్ణవేణి,వీవీఎం పాఠశాలలో పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు.మొత్తం 660 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని,30 మంది ఎన్విజిలేటర్లను నియామకం చేశామన్నారు.కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేదన్నారు. విద్యార్థులకు కావాల్సిన వసతులను ఏర్పాటు చేశామన్నారు.

ఎంసీపీఐయూ నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా వస్కుల మట్టయ్య

నవతెలంగాణ-హుజూర్‌నగర్

బీఎల్‌ఎఫ్ బలపరిచిన ఎంసీపీ ఐయూ అభ్యర్థి వస్కుల మట్టయ్య నల్లగొండ పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్నట్టు ఆదివారం తెలిపారు.ఈ సందర్భంగా పోరాటాల పురిటిగడ్డ అయినా నల్లగొండ పార్లమెంటు కు నన్ను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎంసీపీఐయు జాతీయ కార్యదర్శి అశోక్ ఓంకార్, రాష్ట్ర చైర్మెన్ నల్లసూర్యప్రకాష్, కార్యదర్శి గోదగా రవికి,కార్యవర్గ సభ్యులు వరికుప్పల వెంకయ్య, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వస్కులసైదమ్మ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్ర మంలో నాయకులు కాశీ,గోపి, సోమన్న వేణు, ఓంకారం, ఉగ్రయ్య, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.



3

నవతెలంగాణ

యాదాద్రి భువనగిరి

సోమవారం | మార్చి 18, 2024 | www.navatelangana.com

అవకాశవాదులను ఓడించాలి: ఎస్‌ఎఫ్‌ఐ



నవతెలంగాణ-బొమ్మలరామారం

రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో అవకాశవాద రాజకీయ నాయకులను ఓడించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వనం రాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ 3వ మహాసభ ఆ సంఘం మండల నాయకుడు జగన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వనం రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం తీసుకొచ్చి బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు చదువుకు దూరం చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. 7,177 కోట్ల రూపాయల స్కాలర్షిప్ల పెండింగ్లో ఉన్నాయన్నారు. వాటిని విడుదల చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు రేఖల శ్రీశైలం, ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి లావుడీయ రాజు, గణేష్, జగన్, గణేష్, రాజశేఖర్, అఖిల్, శివరాం, వెంకటేష్, దామోదర్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ వర్ధంతి వారోత్సవాలు



నవతెలంగాణ-బీబీనగర్

భగత్‌సింగ్ 93 వర్ధంతి వారోత్సవాలను జయప్రదం చేయాలని డివైఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకటేష్ అన్నారు. ఆదివారం మగ్దంపల్లి గ్రామంలో మొక్కలు నాటి మాట్లాడారు. భగత్ సింగ్, రాజ్ గురు సుఖదేవులు భారత్ స్వతంత్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించి అది చిన్న వయసులోనే దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన గొప్ప వీరులనారు. భగత్‌సింగ్ వర్ధంతి వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బీబీనగర్ మండల కార్యదర్శి బండారు శ్రావణ్ కుమార్, బొడ్డు చంద్రశేఖర్, బండారు శివ, బండారు భరత్, అబ్దుల్లాపూర్ బాల్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

జగన్మోహినిగా లక్ష్మీనరసింహుడు

- వైభవంగా యాదాద్రి బ్రహ్మోత్సవాలు
- ఘనంగా ఎదుర్కోలు మహోత్సవం



నవతెలంగాణ-యాదగిరిగుట్ట

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉత్సవాల్లో భాగంగా లక్ష్మీనరసింహున్ని జగన్మోహినిగా అలంకరించి ఆలయ ప్రధాన వీధుల్లో ఊరేగించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవంను అత్యంత వైభవంగా చేపట్టారు. లక్ష్మీనరసింహస్వామిని అశ్వవాహనంపై అలంకరించి ఎదుర్కోలు మహోత్సవాన్ని ఆలయ అర్చకులు ప్రధాన అర్చకులు ఊరేగింపు వేడుకను వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన ఎదురుకోలు మహోత్సవాన్ని సర్వ సమానకారు డైన స్వామి వారు అశ్వవాహన దారుడై భక్తకోటిని కటాక్షిస్తూ తిరువీధి సేవలో ఆస్థాన మండపంలోకి విచ్చేయగా, మరోవైపు అమ్మవారు సర్వాలంకార శోభితురాలై స్వామివారి అనుగ్రహాన్ని లోకాన్ని అందించేందుకు కళ్యాణ మహోత్సవాన్ని స్వీకరించదలచి మటంలోకి విచ్చేయగా ఇరువైపులా పండితులు స్వామివారి అమ్మవారి అనంత కళ్యాణ గుణాలు పేర్కొంటూ సూక్తులతో అమ్మవారి వైభవము పురుష సూక్తులతో స్వామివారి దివ్యవాణి వేద పురాణ ప్రబంధాలతో ప్రతిపాదించబడిన అనేక విషయాలను భక్తకోటికి తెలియజేస్తూ ఎదుర్కోలు మహోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త బి నర్సింహమూర్తి ఈవో ఏ భాస్కరరావు ఏఈవోలు సూపరిండెంట్లు పాల్గొన్నారు టీటీడీ ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు బహూకరణ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం తరపున పట్టు వస్త్రాలను దేవస్థానం ఉప కార్యనిర్వహణ అధికారి లోకనాథం ఆలయ పర్యవేక్షకులు సురేష్, మురళి తదితరులు స్వామివారికి సమర్పించారు.

ఉచిత వైద్య శిబిరం: ఉత్సవాల్లో భాగంగా హైదరాబాదులోని సాయి సంజీవని హాస్పిటల్ ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ కళ్యాణకట్ట వద్ద డాక్టర్ అంజయ్య ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆదివారం శ్రీరామ భక్త భజన మండలి మల్లాపురం విశ్వ ఆంజనేయ భక్త సమాజం కార్వాన్ ఆధ్వర్యంలో భజన నిర్వహించారు. అనంతరం అమరవాది వెంకట నరసింహులుతో శ్రీ సుదర్శన నరసింహ హెూమం నరసింహ ఆవిర్భావం గురించి ఉపన్యాస కార్యక్రమం చేపట్టారు. అనంతరం చేబ్రోలు నారాయణదాసు భీష్మ ప్రతిజ్ఞ అనే హరికథ గానం నిర్వహించారు. సాయంత్రం కరీంనగర్‌కు చెందిన శ్రీమతి తిరుమల తో భక్తి సంగీతం జొన్నలగడ్డ సత్య శ్రీరామ్తో కర్ణాటక సంగీత కార్యక్రమం నిర్వహించారు.



ఇండ్ల స్థలాల్లో రాళ్లు నాటుకున్న లబ్దిదారులు



నవతెలంగాణ-ఆలేరుటౌన్

మండలంలోని గోలనుకొండ గ్రామంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పోరాడి సాధించుకున్న ఇండ్ల స్థలాల పట్టాలు, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య లబ్దిదారులకు పట్టాలు పంపిణీ చేయగా, ఆదివారం ప్లాట్ల సాధన కమిటీ కన్వీనర్ తీగల వెంకటేష్, కో కన్వీనర్ బోడా హనుమంతు, సీపీఐ(ఎం) గ్రామ శాఖ కార్యదర్శి సంగి రాజు ఆధ్వర్యంలో రాళ్ల నాటి, నెంబర్లు వేసి పొజిషన్ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బోడ భాగ్య, శాఖ కార్యదర్శి సంగిరాజు, మాజీ మండల కమిటీ సభ్యుడు మధ్యబోయిన ఉప్పలయ్య, సీనియర్ నాయకులు కాస రమేష్ అబ్దిదారులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గోల్డెన్ లీఫ్ వార్షికోత్సవంలో పాల్గొన్న మాజీ ఎంపీ



నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

చౌటుప్పల్ మండలం రెడ్డిబావి భాను ప్రభ ఇన్ఫ్రా డెవలపర్ మొదటి వార్షికోత్సవ కార్యక్రమానికి మాజీ ఎంపీ మురళీమోహన్ విచ్చేసి బ్రోచర్ విడుదల చేశారు. ఆదివారం గోల్డెన్ లీఫ్ వార్షికోత్సవ కార్యక్రమానికి సినీ నిర్మాత, మాజీ ఎంపీ మురళీ మోహన్ మాట్లాడుతూ మ్యూచువల్ ఫండ్, బంగారం కంటే భూమి విలువ 100 శాతం ఎక్కువ అని అన్నారు. హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై హెచ్ఎండిఏ పర్మిషన్‌తో అత్యాధునిక సదుపాయలతో బంగారు ఆకు వెంచర్లో ప్లాట్లు కొనుగోలు చేస్తే మీరు కూడా బంగారం లాగ ఎదుగుతారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జీవి వరప్రసాద్ భాను ప్రభ డెవలపర్ చైర్మన్ వేణు పర్వతం అశోక్, సందీప్, జానీ తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ ఉమెన్స్ కోఆపరేటీవ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా శోభారాణి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

తెలంగాణ స్టేట్ ఉమెన్స్ కో-ఆపరేటర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ్రు శోభారాణి ఎంపిక చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 20 సంవత్సరాలుగా ఆలేరు నియోజకవర్గంలో ప్రజల మధ్య తిరుగుతూ ప్రజా సమస్యలపై పనిచేసిన ఆమెకు ఉమెన్స్ కో-ఆపరేటివ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమించడంతో నియోజకవర్గంలోని పలువురు ప్రజాప్రతినిధులు, అభిమానులు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఉమెన్స్ కోపరేటివ్ డెవలప్మెంట్ కార్పొరేట్ చైర్‌పర్సన్‌గా నియమించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

గిరిజన కార్పొరేషన్ చైర్మెన్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు



నవతెలంగాణ-బీబీనగర్

రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మెన్‌గా నియమితులైన డాక్టర్. బెల్లయ్య నాయక్‌ను ఆదివారం ఆయన నివాస గృహంలో బీబీనగర్ ఎస్టీ సెల్ మండల అధక్షులు మూడవత్ రాజెందర్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర కోఆర్డినేటర్ రాములు నాయక్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గణేష్ నాయక్, భువనగిరి మండల అధ్యక్షుడు రమేష్ నాయక్, జనగాం జిల్లా అధ్యక్షులు సునావత్ సుమన్ నాయక్, భువనగిరి జిల్లా అధ్యక్షుడు రాంజీ నాయక్, రెడ్డి నాయక్, మధు, వీరమల్లు తదితరులు ఉన్నారు.

బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షునిగా దేవేందర్

నవతెలంగాణ-భువనగిరి

బీజేపీ యాదాద్రి భువనగిరి జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, బుగ్గ దేవేందర్‌ను ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షునిగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం పార్టీ కార్యకర్తలు శాలువాతో సత్కరించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బుగ్గ దేవేందర్ మాట్లాడుతూ తన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని పార్టీని బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్మోగిన ఆలయ ప్రాంగణం

నవతెలంగాణ-రాజపేట

మండలంలోని రేణిగుంట గ్రామ రెవెన్యూ పరిధిలో ఆలయ ట్రస్ట్ సభ్యులు ఆధ్వర్యంలో ఆదివారం సంకల్ప సిద్ధి శ్రీ వేంకటేశ్వర స్వామివారి నూతన ఆలయ పూర్ణ ప్రతిష్ఠ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధాన అర్చక స్వాములు వేణుగోపాల దీక్షలు, చెన్నై కి చెందిన డాక్టర్ ఎం ముత్తు బట్టర్, తిరుపతి ప్రఖ్యాత ఆగమశాస్త్ర విశ్లేషకులు శ్రీనివాస దీక్షితులు, చిన్న తాతపూడి వాస్తవ్యులు బిక్కవోలు కేశవాచార్యులు, గౌతమ్ కృష్ణ, ఆలయ మార్గదర్శకులు సిద్దిపేట బ్రహ్మభట్ల శ్రీనాథ శర్మ సిద్ధాంతిల పర్యవేక్షణలు, వేద మంత్రోచ్చారణల మధ్య ఈ విశేష తంతు కొనసాగింది. ఆలయ ట్రస్ట్ సభ్యులు కూర కళ్యాణి బద్రీనాథ్, కుంభాల శోభారాణి ఎల్లారెడ్డి, సూది రెడ్డి కళావతి నాగిరెడ్డి, గొట్టం మంజుల రాఘవేంద్ర, సమ్మెట వెంకట రాజేశ్వరి శ్రీనివాసరావు ఇతర భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక వైద్య శిబిరం: మండలంలోని రేణికుంట గ్రామ రెవెన్యూ పరిధిలో సంకల్ప సిద్ధి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి నూతన ఆలయ పూర్ణ ప్రతిష్ఠ కార్యక్రమాల సందర్భంగా వైద్య శాఖ ఆధ్వర్యంలో రెండో రోజు ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని కొనసాగించారు. మూడు రోజులపాటు భక్తుల కోసం ఈ శిబిరం కొనసాగుతుందని వైద్యాధికారిని సుప్రియ తెలిపారు. ఆలయ ట్రస్ట్ ఈ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక గుడారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిని డాక్టర్ సుప్రియ, హెల్త్ అసిస్టెంట్ ఉపేందర్, ఏఎన్ఎం కవిత, మాధవి, ఆశ వర్కర్లు కృష్ణనీల, జయశ్రీ, మహేశ్వరి, లక్ష్మీ ప్రసన్న తదితరులు ఉన్నారు. క్యాంపు ఏర్పాటు చేయడం పట్ల భక్తులు సంతోషం వ్యక్తం చేస్తూశాఖ వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెబుతూ, ట్రస్ట్ సభ్యులను అభినందించారు. వైద్య శిబిరం ఏర్పాట్లు పట్ల రాజపేట మండల జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు ఉప్పల రమేష్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు.

కాంగ్రెస్ గ్రామశాఖ మహిళా అధ్యక్షుల నియామకం

నవతెలంగాణ-రాజాపేట

మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలి ఆధ్వర్యంలో వివిధ గ్రామ శాఖలలో మహిళా అధ్యక్షులను నియమించి వారికి నియామక పత్రం ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజపేట టౌన్ అధ్యక్షురాలుగా ఆకిరెడ్డి ఉమా, బసంతపురం అధ్యక్షురాలుగా రేణుక, దూది వెంకటాపురం అధ్యక్షురాలుగా యాదమ్మ, రేణిగుంట అధ్యక్షురాలుగా ఉపేంద్ర, చల్లూరు అధ్యక్షురాలుగా మౌనిక, రఘునాథపురం అధ్యక్షురాలుగా అరుణ, కొత్తజాల అధ్యక్షురాలుగా రమ్య, పాతజాల అధ్యక్షురాలుగా సునీత, ఈ నియామక పత్రాలు మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు నాగారం రేణుక చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు పోలోజు విజయలక్ష్మి ఉపేంద్ర కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు నమిల మహేందర్ గౌడ్ టౌన్ అధ్యక్షులు ఐరేని నవీన్ కుమార్ మండల జిల్లా నాయకులు గౌరా బక్కయ్య మల్లయ్య తదితరులున్నారు.

వైశ్య కార్పొరేషన్ చైర్మెన్ ఎంపిక పట్ల హర్షం

నవతెలంగాణ-రాజాపేట

మొదటిసారిగా ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ తొలి చైర్మెన్‌గా నియమితులైన కల్వ సుజాతకు రాజపేట మండల ఆర్యవైశ్య సంఘం ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని, దీంతో లేదా నిరుద్యోగ చిన్న వర్తక ఆర్యవైశ్య వ్యాపారులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. సీనియర్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి, ఆర్యవైశ్య మహిళా విభాగం కోశాధికారి కల్వ సుజాతను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియమించడం సంతోషకరమైన విషయం అన్నారు. సందర్భంగా ప్రభుత్వ బీర్ల ఐలయ్యకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజపేట మండల ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

ఎన్నికలకు ప్రతిఒక్కరూ సహకరించాలి

- కలెక్టర్ హనుమంత్ కె జెండగే



నవతెలంగాణ-భువనగిరి

ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత్ కె జెండగే కోరారు. ఆదివారం ఆయన డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేష్ చంద్ర, జిల్లా అదనపు కలెక్టర్లు పి. బెన్ షాలోమ్, గంగాధర్‌లతో కలిసి జిల్లాలో పార్లమెంట్ సాధారణ ఎన్నికల నిర్వహణపై ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి షెడ్యూల్ నిన్న విడుదల చేసిందని, మనకు నాలుగవ విడతలో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. వచ్చే ఏప్రిల్ 18వ తేదీన నోటిఫికేషన్, ఏప్రిల్ 25 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. ఏప్రిల్ 26న నామినేషన్ల పరిశీలన, ఏప్రిల్ 29న నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందని, మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ జరుగుతుందన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం సంబంధి సంబంధించి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఇబ్రహీంపట్నం, మునుగోడు, భువనగిరి, నకరేకల్, తుంగతుర్తి, ఆలేరు, జనగాం అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని తెలిపారు. 2141 పోలింగ్ స్టేషన్స్ ఉన్నాయని, 8,94,789 మంది మహిళలు, 9,05,531 మంది పురుషులు, 78 మంది ఇతరులు కలిపి మొత్తము 18 లక్షల 398 ఓటర్లు ఉన్నారని తెలిపారు. నిన్నటి నుండి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు ఓటు వేయాలని, ఓటు హక్కు అందరి బాధ్యత విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేష్ చంద్ర మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే ప్రతి ఒక్కరికి నిబంధనలు వర్తిస్తాయని అన్నారు. ఎన్నికల ప్రక్రియకు పూర్తి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, యాదాద్రి భువనగిరి జిల్లాకు సంబంధించి తొమ్మిది చెక్ పోస్టుల ద్వారా పూర్తి నిఘా ఉంటుందన్నారు. నగదు, మద్యం అక్రమ రవాణా జరగకుండా, అలాగే గంజాయి, మత్తు పదార్థాల రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల దృష్ట్యా ప్రజలు ఆధారాలు లేకుండా 50 వేలకు మించి నగదుతో ప్రయాణించవద్దని, ప్రతిరోజు తనిఖీలలో జప్తు చేసిన సొమ్మును జిల్లాలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తామన్నారు. ఆధారాలు సమర్పించి గ్రీవెన్స్ కమిటీ నగదు విడుదల చేస్తుందని తెలిపారు. తనిఖీల నిర్వహణలో ప్రతి పనిని వీడియోగ్రఫీ చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు.





ఒకేరోజు అత్తాకోడళ్ల మృతి

నవతెలంగాణ-యాదగిరిగుట్ట రూరల్

ఒకే రోజు అత్తాకోడళ్లు మృతి చెందిన ఘటన యాదగిరిగుట్ట మండలం దాతర్‌పల్లి గొల్లగుడిసెలులో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. అత్త గుండెపోటుతో మరణించగా మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చిన కొద్ది సేపటికే కోడలు రోదిస్తు అపస్మారక స్థితిలోకి వెళ్లింది.కోడలిని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో ఆ గ్రామంలో విషాధ ఛాయలు అలుముకున్నాయి.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్‌కు శుభాకాంక్షలు

నవతెలంగాణ-భువనగిరి

ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్‌గా నియమితులైన నాగరిగారి ప్రీతంకి ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షులు నోముల తరుణ్ ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్‌గా నియమితులైన నగారిగారి ప్రీతంని వారి నివాసంలో కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కనుకుంట్లా బాబు రావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కనకుంట్ల కొండల్, యూత్ కాంగ్రెస్ కార్యదర్శి బాలస్వామి, పొట్ట శరత్, రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షాసామగ్రి అందజేత

నవతెలంగాణ-రాజపేట

ఎస్ఎస్‌సి పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు రాజాపేట మండలం నమిల గ్రామంలో శనివారం పదవ తరగతి చదివే విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు మార్క శివ కుమార్ అందజేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, గ్రామ యువకులు అనిల్ మని జ్ఞానేందర్ రమేష్ రాజు భాస్కర్ శ్రవణ్ పాల్గొన్నారు. రాజపేటలో 390 మంది ఎస్ఎస్సి పరీక్షకు హాజరు రాజపేట మండలంలోని మూడు పరీక్ష కేంద్రాలలో నేటినుండి జరగనున్న ఎస్ఎస్సి పరీక్షలకు 390 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. మొత్తం 13 ప్రభుత్వ 2 ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు మూడు పరీక్షా కేంద్రాలైన రఘునాథపురం లో 90 మంది, రాజపేట బాలుర పాఠశాలలో 160 మంది, బాలికల పాఠశాలలో 140 మంది హాజరుకానున్నట్లు, ఉదయం 9:30 నుండి 12:30 వరకు పరీక్ష నిర్వహించబడుతుందని గంట ముందు పరీక్షా సెంటర్ కు హాజరుకావాలని అధికారులు చెప్పారు. పరీక్ష సమయంలో సెంటర్ వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

బెల్లయ్యనాయక్‌కు ఘనంగా సన్మానం

నవతెలంగాణ-రాజపేట

తెలంగాణ రాష్ట్ర గిరిజన ఆదివాసి రాష్ట్ర అధ్యక్షులు తేజావత్ బెల్లయ్య నాయక్‌కి గిరిజన కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్మెంట్స్ కార్పొరేషన్ చైర్మన్ నియకమైన సంధర్భంగా వారిని యాదాద్రి జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు రాంజీ నాయక్ ఆధ్వర్యంలో తన నివాసంలో కలిసి ఘనంగ సన్మానించారు. గంగా ఆయన మాట్లాడుతు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీకి అండగా నిలిచి. దేశభావి ప్రధాని రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో కాశీ నుండి కన్యాకుమారి వారకు తన వెంట ఉండి యత్రని విజయవంతం చేయడంలో తను ఎంతో కృషి చేశారు. 20సం రాలు తండాలు గ్రామ పంచాయితీ కోసం పోరాటం చేసి ఏర్పాటు చేసేవరకు ఉద్యమం చేశారు అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ గుర్తించి ఈ పదవీ నియమించింది. తెలంగాణ గిరిజన పక్షాన సి.యం.రేవంత్ రెడ్డి కి, ప్రభుత్వ విప్ ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే బిర్ల.ఐలయ్య కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆదివాసి గిరిజన సెక్రటరీ రాజు నాయక్ . అన్ని మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు. మాన్య నాయక్ క్రాంతి నాయక్ . పాట్టు నాయక్. నరసింహ నాయక్. రాజేందర్ నాయక్. రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ స్టార్ వెంచర్ ఎదుట ప్లాట్ల బాధితులు ధర్నా



నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

చౌటుప్పల్ మండలం తూప్రాన్ పేట గ్రామంలో గ్రీన్ స్టార్ ప్లాట్ల ఓనర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గ్రీన్ స్టార్ వెంచర్ ఎదుట టెంట్లు వేసి ఆదివారం ప్లాట్ల బాధితులు ధర్నా నిర్వహించారు. గ్రీన్ స్టార్ వెంచర్‌లో 2000-2001 సంవత్సరంలో సర్వే నెంబర్ 23, 33 లల్లో నెలకు వేయి రూపాయల కిస్తుల చొప్పున 100 గజాల ప్లాట్లు కొనుగోలు చేశామని చెప్పారు. ఈ విధంగా ఒక్కొక్కరు 200, 100 గజాల చొప్పున 110 ప్లాట్లను కొనుగోలు చేశామని, తమ పేరా రిజిస్ట్రేషన్లు కూడా చేసుకున్నామని ప్లాట్ల బాధితుల సంఘం అధ్యక్షులు కే.సత్యనారాయణ తెలిపారు. వెంచర్ యజమాని అంబికా ప్రసాద్ తమ ప్లాట్లను కబ్జా చేసుకుని ప్లాట్ల చుట్టూ ప్రహరీ నిర్మించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2021 సంవత్సరంలో ప్లాట్ల వద్దకు పోతే వెంచర్లోకి రానీయకుండా త్రివ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని సత్యనారాయణ తెలిపారు. అప్పట్లో అంబిక ప్రసాద్‌పై చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదు అయిందని అన్నారు. ప్లాట్ల బాధితులు తమ ప్లాట్లు తమకు కావాలని నినాదాలు చేస్తూ అంబికా ప్రసాద్ నుంచి రక్షణ కల్పించాలని కోరారు. వెంచర్ దగ్గరికి వస్తే సెక్యూరిటీని పెట్టుకొని, కుక్కలను మా మీదకి తోలి త్రివ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ప్లాట్ల బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నోసార్లు చౌటుప్పల్ తహసిల్దార్, ఆర్డీవోలకు ఫిర్యాదు చేసినా అంబికా ప్రసాద్ తమని ప్లాట్‌ల వద్దకు రానీయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ స్టార్ ప్లాట్ల యజమానుల అసోసియేషన్ ఉపాధ్యక్షులు చిలుకూరి లక్ష్మారెడ్డి కార్యదర్శి సయ్యద్ అలీముద్దీన్ సహాయ కార్యదర్శి గండ్ల వేణుగోపాల్ కోశాధికారి లలిత కుమారి ఎగ్జిక్యూటివ్ మెంబర్లు దారా,ఆరిఫుద్దీన్ బాధితులు పాల్గొన్నారు.

దేశసేవలో కల్నల్ వీవీబీ రెడ్డి చిరస్మరణీయుడు

- ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



నవతెలంగాణ-బొమ్మలరామారం

దేశసేవకే అంకితమై వాయుసేనలో సేవలందిస్తూ ప్రమాదవశాత్తూ విధి నిర్వహణలో మరణించిన కల్నల్ వినయ్ భాను రెడ్డి చిరస్మరణీయుడని, అతని జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. మండల కేంద్రం గుడిబావి చౌరస్తాలో కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో లెఫ్టినెంట్ కల్నల్ వినయ్ భాను రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్నల్ వీవీబి రెడ్డి దేశానికి అందించిన సేవలు మరువలేనివి అన్నారు. దేశం కోసం ప్రాణాలను అర్పించిన వీరులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాంపల్లి మహేష్ గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ బాల నర్సయ్య, ఎంపీటీసీలు ఈదమ్మ, రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం, రిటైర్డ్ ఆర్మీ అధికారులు, కుటుంబ సభ్యులు ఉప్పల నరసింహారెడ్డి, మోకు మధుసూదన్ రెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

ప్రశాంతవాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాయాలి



నవతెలంగాణ-ఆలేరుటౌన్

ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాయాలని ఆలేరు మండల విద్యాధికారి జంగిడి కృష్ణ ఆదివారం తెలిపారు. మండలంలోని విద్యార్థులకు, ఆలేర్ పట్టణంలో మూడు సెంటర్లుజిల్లా ప్రజా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల , శ్రీ రామకృష్ణ విద్యాలయం, జేఎంజె హైస్కూల్‌లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 8:30 గంటల కి విద్యార్థులు పరీక్ష హాలుకు చేరుకోవాలన్నారు. 9:30 గంటల నుండి, మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించబడతాయన్నారు. విద్యార్థుల పరీక్ష రాయడం పూర్తయినప్పటికీ 12 గంటల వరకు హాలులోనే వేచి ఉండాలన్నారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించామన్నారు. 5 నిమిషాల లోపు విద్యార్థులు పరీక్షాలకు తప్పనిసరి చేరుకోవాలన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా పట్టణంలోని జిరాక్స్ సెంటర్ లను ప్రభుత్వ ఆదేశాల మేరకు బందు చేయడం జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి రావాలని సూచించారు. పరిక్షా సమయాల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి ఇన్విజిలేటర్లకు అధికారులు పలు సూచనలు చేశారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ ,రెసిడెన్షియల్ పాఠశాల చెందిన 672 మంది విద్యార్థులు పరీక్షలు రాయానున్నారు.

బీబీనగర్ : నేటి నుండి పదవ తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించబడును అని మండల విద్యాధికారి నాగవర్ధన్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 764 మంది విద్యార్థులు పరీక్ష రాయనునట్లు తెలిపారు. మండలానికి నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఒక్కొ పరీక్ష కేంద్రంలో 200 మంది విద్యార్థులు పరీక్ష రాయన్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలు 1)ప్రభుత్వ ఉన్నత పాఠశాల బీబీనగర్(200), 2) కిడ్స్ కింగ్డమ్ గ్రామర్ హై స్కూల్ బిబినగర్(200), 3) మాంటిసోరి హై స్కూల్ బీబీనగర్(198), 4) లిటిల్ బర్డ్స్ హై స్కూల్ బిబినగర్(166). లలో నిర్వహించబడునని తెలిపారు. పరీక్షకు హాజరఘు విద్యార్థులు స్కూల్ యూనిఫామ్ ధరించకుండా, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకు రాకుండా ఉండాలని, ఐదు నిమిషాలు ఆలస్యం అయితే పరీక్ష కేంద్రాంలోకి అనుమతించబడదు అన్నారు.

రైతులను ఇబ్బందిపెడితే ఊరుకోం

- మిల్లర్లకు ఎమ్మెల్యే హెచ్చరిక

నవతెలంగాణ-మిర్యాలగూడ



రైతులను ఇబ్బందులు పెడితే ఊరుకోమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మిల్లర్లకు హెచ్చరించారు.ఆదివారం బైక్‌పై మిల్లుల వెంట తిరిగి రైతుల ఇబ్బందులను అడిగి తెలుసు కున్నారు. మిల్లర్లు ధర తక్కువ వేస్తున్నారని చెప్పగా మంచిధర ఇచ్చి ఆదుకోవాలని కోరారు. మిల్లుల వద్దకు వచ్చిన దాన్యాన్ని మిల్లర్లు తప్పనిసరిగా కొనుగోలు చేయాలని ఆదేశించారు.రైస్‌మిల్లర్లను కలిసి ధాన్యం కొనుగోలు ఆలస్యంగా చేస్తూ రైతులను రోజులకు తరబడి రోడ్లపై వెయిటింగ్ చేయించి వారిని ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు.రైతులకు సరైన ధర నిర్ణయించి న్యాయం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రైతులు పాల్గొన్నారు.

ముస్లిముల సంక్షేమానికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-మిర్యాలగూడ



ముస్లిముల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు.ఆదివారం పట్టణంలోని ఇస్లాంపురం మస్జిద్ -ఎ - ఉమర్ ఫారుక్ లో కౌన్సిలర్ ఘని ఏర్పాటు చేసిన రంజాన్ ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులు అందరూ ఈ రంజాన్ ఉపవాస దీక్షలు విజయవంతంగా పూర్తిచేసుకొని అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఎమ్మెల్యేగా గెలవడానికి ముస్లిం సోదరుల కృషి చాలా ఉందన్నారు.మీకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ నా సహాయ సహకారాలు అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలి

- జిల్లాలో మొత్తం 1766 పోలింగ్ కేంద్రాలు
- 46 ఆక్సిలరీ, 30 ప్రత్యేకకేంద్రాలు
- 14.9 లక్షల ఓటర్లు.. అందులో 7.54 లక్షల మహిళా ఓటర్లు
- హోమ్ ఓటింగ్ కోసం నేటి నుండి 12 డి సదుపాయం
- కలెక్టర్ హరిచందన దాసరి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్



నల్గొండ జిల్లాలో పార్లమెంటు ఎన్నికలను స్వేచ్ఛగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన కోరారు. శనివారం కేంద్రఎన్నికల సంఘం పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిన నేపథ్యంలో ఆదివారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 18న పార్లమెంట్ ఎన్నికల గజిట్ నోటిఫికేషన్ విడుదలవుతుందని, ఏప్రిల్ 25 న నామినేషన్ దాఖలు చేసేందుకు చివరి తేదీగా నిర్ణయించడం జరిగిందని, 26 న నామినేషన్ల పరిశీలన, 29 న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు.పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ మే 13న జరుగుతుందని, జూన్ 4వ తేదీన దేశవ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉంటుందని ఆమె వెల్లడించారు.నల్గొండ జిల్లాలో మొత్తం 1766 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 46 ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించామని, 30 ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు, 30 మహిళా నిర్వహణ పోలింగ్ కేంద్రాలు, 6 యూత్ పోలింగ్ కేంద్రాలు, మరో 6 పీడబ్ల్యూడీ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు.14.9 లక్షల ఓటర్లు ఉండగా, 7.35 లక్షల పురుష ఓటర్లు, 7.54 లక్షల మహిళా ఓటర్లు ఉన్నారని, కొత్తగా 52,000 మంది ఓటర్లు నమోదయ్యారని తెలిపారు.హోమ్ ఓటింగ్ కోసం ఆదివారం నుండి ఫార్మ్ 12 -డి అందుబాటులో ఉంచడం జరిగిందని, ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో 80 సంవత్సరాలు నిండిన సీనియర్ సిటిజన్లకు హోమ్ ఓటింగ్ సౌకర్యం ఉండేదని, దానిని కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఎన్నికలలో 85 ఏండ్లకు పెంచామన్నారు.ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది, ఈవీఎంలు, వీవీప్యాడ్లు అన్ని సిద్ధంగా ఉన్నాయని, ఎన్నికల వ్యయాన్ని నిర్వహించేందుకు జిల్లా కోపరేటివ్ అధికారి నోడల్ అధికారిగా ఎక్స్పెండిచర్ టీంను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ బృందాలు ఇదివరకే వారి పనులను మొదలుపెట్టాయని తెలిపారు.రాజకీయ పార్టీలు ప్రభుత్వ ఆవరణలను, స్థలాలను అధికారిక కార్యాలయాలను ఎన్నికల ప్రచారం కోసం వాడకూడదని, ఎన్నికలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులను సి -విజిల్ తో పాటు, 1950 కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేసి చెప్పవచ్చని పేర్కొన్నారు.సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ న్యూస్ పై యాక్షన్ తీసుకుంటామని వెల్లడించారు. జిల్లా ఎస్పీ చందనా దీప్తి మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని వినియోగించుకుని ఎన్నికల ప్రచారం చేయకూడదని, అదే విధంగా ఏదైనా వేడుకలను ఎన్నికలకు అనుకూలంగా మార్చుకోకూడదని, నామినేషన్ల సందర్భంగా 3 వాహనాలకు మించి వినియోగించరాదని, ప్రయివేట్ ఆవరణలో ఏదైనా ప్రచారానికి సంబంధించి వాడుకున్నట్లయితే యజమాని ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పార్లమెంట్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి శనివారం నుండి అమల్లోకి వచ్చిందని, ఇందుకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా హోర్డింగులు, పోస్టర్లు, బ్యానర్లు వంటి వాటిని తొలగించడం జరుగుతుందని, 72 గంటల్లో పూర్తిగా వీటిని తీసివేస్తామని తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఏ ఒక్కరూ రూ.50 వేల మించి నగదును తీసుకువెళ్ల వద్దని, ఒకవేళ తీసుకు వెళ్లాల్సి వస్తే సరైన ఆధారాలను రుజువుగా ఉంచుకొని తీసుకు వెళ్ళవలసి ఉంటుందని, ఎక్కడైనా డబ్బు స్వాధీనం చేసుకున్నట్టయితే జిల్లా స్థాయిలో గ్రీవెన్స్ కమిటీ వాటిని పరిశీలించిన తర్వాత విడుదల చేస్తుందని తెలిపారు. ఏదైనా ర్యాలీ తీయాల్సి వస్తే పది వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని, రాత్రి 10 దాటితే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని తెలిపారు.ఈ సమావేశంలో స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్‌ఓ డి రాజ్యలక్ష్మి, సీపీఐ(ఎం) నుండి పి.నర్సిరెడ్డి, బీఎస్పీ నుండి ప్రధాన కార్యదర్శి షేక్ చాంద్‌పాషా, బీజేపీ ప్రధాన కార్యదర్శి లింగస్వామి ఎంఐఎం కోశాధికారి గౌస్ మహమ్మద్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ నల్లగొండ అశోక్, బీఆర్ఎస్ పార్టీ నుండి పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

రమేశ్‌రెడ్డిని వరించిన పర్యాటకం

- పేటలో టూరిజం అభివృద్ధికి కృషి చేస్తా
- రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్ పటేల్ రమేశ్‌రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట





ఎట్టకేలకు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేశ్‌రెడ్డికి పదవి వరించింది. గత రెండు పర్యాయాలుగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట టిక్కెట్ ఆశించి భంగపడిన రమేశ్‌రెడ్డి కాంగ్రెస్ పట్ల విధేయత చూపుతూ వస్తున్నారు.ఈ క్రమంలో ఏఐసీసీ, టీపీసీసీలు యంపీ టిక్కెట్ ఇస్తామని రెండు దఫాలుగా ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోయింది.అయినా సరే పార్టీని వీడకుండా ఆయన సహనం ప్రదర్శించారు.చివరికి ఎట్టకేలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో పలు విభాగాలకు కార్పొరేషన్లకు చైర్మెన్లను ప్రకటించారు. అందులో పటేల్‌కి పర్యాటక డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మెన్‌గా మొదటి స్థానంలో ప్రాధాన్యతతో పెద్ద పీట వేసింది.ఈ ప్రకటన విడుదలతో రమేశ్‌రెడ్డితో పాటు ఆయన వర్గీయులు,అభిమానులు, పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా రమేశ్‌రెడ్డి తన రాజకీయ జీవితాన్ని టీడీపీఓ ప్రారంభించారు. సర్పంచ్, జెడ్పీటీసీ తదితర పదవులు ఆయన నిర్వహించారు. అనంతరం టీడీపీ నుండి సూర్యాపేట అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి దాదాపుగా 38 వేల ఓట్లు సాధించారు.అనంతరం తెలంగాణ రాష్ట్రం ఏర్పడడంతో రేవంత్‌రెడ్డితో కలిసి ఆయన కాంగ్రెస్‌లో చేరారు. ఆ క్రమంలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్ ఆశించారు.తర్వాత 2023 ఎన్నికల్లో కూడ టిక్కెట్ కోసం పోటీ పడ్డారు.అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో పాటు తన స్నేహితుడు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం రమేశ్‌రెడ్డికి కలిసొచ్చింది.ఏఐసీసీ, టీపీసీసీలు హామీలు విస్మరించినా స్నేహితుడిపై భరోసాతో రమేశ్‌రెడ్డి పార్టీకి విధేయతగా వున్నారు.దీంతో ఆయనకు తొలి విడతలోనే పర్యాటక డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ పదవి దక్కింది. ఈ సందర్భంగా ఆదివారం పటేల్ నివాసం వద్ద నాయకులు, అభిమానులు ఆయనకు బొకేలు, శాలువాలు, పూలదండలతో శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ సామాన్య కార్యకర్తకే కాకుండా పేటకు దక్కిన గౌరవమన్నారు.తనపై పెట్టిన నమ్మకాన్ని బాధ్యతలు నిలబెట్టుకుంటానని,జిల్లాను పర్యాటక రంగంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం నాపై నమ్మకంతో ఇచ్చిన పదవిని శక్తివంచన లేకుండా తన వంతు సహకారం అందిస్తానన్నారు.ఇది సామాన్య కార్యకర్తకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఉన్న పిల్లలమర్రి దేవాలయం ,ఉండ్రుగొండ నాగులపాడు ,సద్దుల చెరువు అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారని తెలిపారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా కాంగ్రెస్ పార్టీ గెలుపునకు తనవంతు కృషి చేస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విజయవంతమైందని తెలిపారు.సహకరించిన మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తం కుమార్‌రెడ్డి,సీతక్కలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సీఏఏ చట్టంతో రాజ్యాంగానికి తూట్లు

- వ్యకాస రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య

నవతెలంగాణ-వేములపల్లి



బీజేపీ ప్రభుత్వం సీఏఏ చట్టం తెచ్చి రాజ్యాంగానికి తూట్లు పొడిచిందని వ్యాకాస రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య అన్నారు. ఆదివారం మాడుగులపల్లి మండలంలోని కుక్కడం గ్రామంలో ప్రజా సంఘాల క్యాంపెయిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం అమలుకు పూనుకోవటం సిగ్గు చేటని, ఇది ప్రజల దృష్టిని మరల్చడానికేనన్నారు. సీఏఏ ప్రజల మధ్య మతపరమైన విభజనను తీసుకువచ్చే చట్టమని ఆయన అభివర్ణించారు. ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించి సుప్రీంకోర్టు ఆదేశాలతో తీవ్ర ఇబ్బందుల్లో పడిందన్నారు. దేశంలో ఆకలి, నిరుద్యోగం, ధరలు పెరిగాయని, దళితులు, మైనార్టీలు, మహిళలపై దాడులు జరుగుతున్న యన్నారు. సీఎఏ అమలు రాజ్యాంగ విరుద్ధమని ప్రతి అంశాన్ని హిందూ, ముస్లిం సమస్యగా ముందుకు తీసుకొచ్చి ఎన్నికల్లో లబ్ది పొందేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. 4 సంవత్సరాల క్రితమే ఆమోదించిన చట్టాన్ని ఇన్ని సంవత్సరాలు నోటిపై చేయకుండా కేవలం ఎన్నికల నేపథ్యంలో నోటిఫై చేయడం ద్వారా మెజారిటీ హిందూ ఓటర్లను ప్రభావితం చేసి ఎన్నికల్లో లబ్ది పొందేందుకు సిఎఎ ను ముందుకు తీసుకువచ్చిందన్నారు. కేరళలో సిపిఎం ఆధ్వర్యంలోని పినరయి విజయన్ ప్రభుత్వం ఈ చట్టాన్ని మతపరంగా ప్రజలను విభజించే చట్టంగా అభివర్ణించి, చట్టాన్ని అమలు చేయబోమని స్పష్టం చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవాలని కోరారుఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బుజ్జ చిన్న వెంకులు, నాయకులు రొండి శ్రీనివాసులు వ్యకాస మండల కార్యదర్శి బొంగరాల వెంకటయ్య, బొంగరాల ఎల్లయ్య, మునగాల నారాయణరెడ్డి, లక్ష్మీ, విజయ, రాములమ్మ లక్ష్మమ్మ ముత్యాలు పాల్గొన్నారు.

టెలివిజన్ ఛానెళ్లు.. వార్తాపత్రికలలో ప్రభుత్వ ప్రకటనలు నిలిపివేయాలి

- కలెక్టర్ హరిచందన దాసరి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

పార్లమెంట్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలలో ఉన్నందున అన్ని టెలివిజన్ ఛానెళ్లు, వార్తాపత్రికలలో ప్రభుత్వ పథకాలపై ప్రకటనలు ప్రసారం చేయడం, ప్రచురించడం వంటివి నిలిపివేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.శనివారం కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిందని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలమేరకు ఎన్నికల షెడ్యూల్ వెలువడిన 72 గంటలలోపు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన అన్ని రకాల ప్రకటనలను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారం చేయడం, ప్రచురించడం నిలిపివేయాలన్నారు.ప్రభుత్వం సాధించిన విజయాలను సైతం ప్రచురించవద్దని, అలా కాదని ఎన్నికల సంఘం నిబంధనలు ఉల్లంఘిస్తే ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలు ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన అడ్వర్టైజ్మెంట్లు, ప్రభుత్వం సాధించిన విజయాలు వంటివి ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలో ప్రచురించడం నిలిపివేయాలని స్పష్టం చేశారు.

యూత్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శికి సన్మానం

నవతెలంగాణ-నకిరేకల్

యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మేరెడ్డి ప్రవీణ్‌రెడ్డిని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దైద రవీందర్ ఆదివారం తన నివాసంలో ఘనంగా సన్మానించారు.అంతకుముందు పట్టణంలోని తాటికల్ రోడ్డులో నివాసముంటున్న స్థానికులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు చల్ల జీవన్‌రెడ్డి, ఎన్ ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజన్ కుమార్ యాదవ్, నాయ కులు తిరుపతి శ్రీను, చందుపట్ల నగేష్ పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నవతెలంగాణ-పెన్‌పహాడ్

రోడ్డు ప్రమాదం జరిగి వ్యక్తికి గాయాలైన మండల పరిధిలోని దుపహడ్ గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది.ఎస్ఐ పెరిక రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలపరిధిలోని దూపహాడ్ గ్రామానికి చెందిన కొప్పోజు గోపయ్యాచారి శనివారం రాత్రి సుమారు ఏడుగంటల సమయంలో గ్రామంలోని ప్రధాన రహదారిపై రోడ్డు దాటుతుండగా గరిడేపల్లి నుండి సూర్యాపేటకు వెళ్తున్న లారీ తగిలి కిందపడగా తన రెండు కాళ్ళమీద నుండి లారీ ముందు కుడివైపు చక్రాలు దాటడంతో రెండు కాళ్ళు విరిగిపోయాయి. వెంటనే బాధితున్ని అంబులెన్సులో చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియాస్పత్రికి బాధితుని భార్య శ్రీహర్షిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎండిపోయిన పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆత్మకూరుఎస్

పంట పొలాలు ఎండిపోతున్న నేటికి ఆదుకోలేని అసమర్ధ ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని మాజీ మంత్రి,ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆరోపించారు.



ఆదివారం మండలపరిధిలోని రామోజీతండా, రామన్నగూడెం గ్రామాలలో ఎండిపోయిన వరిపొలాలను, మిరప తోటలను ఆయన పరిశీలించి మాట్లాడారు.తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి కేసీఆర్ ప్రభుత్వంలో ఒక ఎకరా పొలం ఎండలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏ గ్రామంలో చూసిన ఎకరాల కొద్ది వరి పొలాలు ఎండిపోతున్నాయని విమర్శించారు.ప్రభుత్వంలో బోరు బావులను పూడ్చి వేసిన రైతులు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మళ్లీ బావుల పూడిక తీస్తూ నూతనంగా బోర్లు వేపిస్తున్నారని తెలిపారు. ఎండిపోయిన వరి పొలాలకు ఎకరాకు రూ.50వేల నష్టపరహారం, మిరప తోటలకు రూ.80వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాలేశ్వరంలో నీళ్లన్నా ఎత్తిపోయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నారుతప్ప ప్రజల కష్టాలు పట్టించుకోవడంలేదన్నారు.ఈ సందర్భంగా పలువురి రైతులతో మాట్లాడి పంటల వివరాలు తెలుసుకున్నారు.అనంతరం రామన్నగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కంఠమహేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండలఅధ్యక్షుడు తూడి నర్సింహారావు,జెడ్పీ వైస్‌చైర్మెన్ వెంకట్‌నారాయణగౌడ్, మరిపెద్ది శ్రీనివాస్‌గౌడ్,టీఎస్‌సీఎస్ చైర్మెన్ కొనతం సత్యనారాయణరెడ్డి, బొల్లె జానయ్య,బత్తుల ప్రసాద్, కసగాని బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీకార్పొరేషన్ చైర్మెన్‌ను కలిసిన యూత్ కాంగ్రెస్‌ప్రధాన కార్యదర్శి

నవతెలంగాణ-తుంగతుర్తి

తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ (ఎస్సీ కార్పొరేషన్)చైర్మెన్‌గా నియమితులైన నాగరిగారి ప్రీతంను కాంగ్రెస్ తుంగతుర్తి నియోజకవర్గ యూత్ ప్రధాన కార్యదర్శి బైరు చిరంజీవి ఆదివారం కలిశారు.చైర్మెన్‌గా నియామకం అవ్వడం పట్ల శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 37 కార్పొరేషన్లకు చైర్మెన్లను నియమిం చారన్నారు.అందులో యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ వాసి, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాగరిగారి ప్రీతంకు అవకాశం దక్కిందన్నారు. కాంగ్రెస్ లోపలు హోదాల్లో పనిచేసి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులుగా ప్రస్తుతం కొనసాగుతు న్నారన్నారు.21 ఏండ్లకే ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శిగా పనిచేయడంతోపాటు ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారన్నారు.పార్టీ పిలుపు మేరకు ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ వస్తున్న క్రమంలో నేడు ఎస్సీ కార్పొరేషన్ పదవి సాధించారన్నారు.ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మెన్ రావడానికి సహకరించిన ముఖ్యమంత్రికి,పార్టీ పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



రూ.10వేల ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-పెన్‌పహాడ్

మండలపరిధిలోని లింగాల గ్రామంలోని ప్రతి ఆడబిడ్డ వివాహానికి ఆర్థికసాయం చేస్తానని ఇచ్చిన మాట ప్రకారం మండల కేంద్రంలోని సత్య గార్డెన్స్ లో గ్రామానికి చెందిన మామిడి భిక్షం తిరపమ్మ కుమార్తె గౌతమి వివాహానికి ఆదివారం హాజరైన దొంగరి గోపికృష్ణ నూతన దంపతులను ఆశీర్వదించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన ప్రతి ఆడబిడ్డ వివాహానికి తన వంతు ఆర్థికసాయం అందిస్తు న్నానని, గ్రామంలోని ప్రతి ఒక్కరి కష్టనష్టాల్లో కచ్చితంగా తోడుంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో దొంగరిజనార్ధన్, గౌతమి, జయమ్మ, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

అమల్లోకి ఎన్నికల ప్రవర్తనా నియమావళి

- 18న గెజిట్ నోటిఫికేషన్.. 25న నామినేషన్లకు చివరి గడువు
- మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు
- ఆదివారం నుండే ఎన్నికల వ్యయం లెక్కింపు
- కలెక్టర్ హరిచందన దాసరి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి శనివారం నుండి అమలులోకి వచ్చినట్లు కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. ఆదివారం ఆమె కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పార్లమెంట్ ఎన్నికలపై మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌ను ఆమె తెలియజేస్తూ ఏప్రిల్ 18న పార్లమెంట్ ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదలవుతుందన్నారు.ఏప్రిల్ 25 న నామినేషన్ దాఖలు చేసేందుకు చివరి తేదీ గా నిర్ణయించడం జరిగిందని, 26 న నామినేషన్ల పరిశీలన, 29 న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని, పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ మే 13 న జరుగుతుందని, జూన్ 4 వ తేదీన దేశవ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉంటుందని వెల్లడించారు. నల్గొండ జిల్లాలో మొత్తం 1766 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 46 ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించామని, 30 ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు, 30 మహిళా నిర్వహణ పోలింగ్‌కేంద్రాలు, 6 యూత్ పోలింగ్ కేంద్రాలు, మరో 6 పీడబ్ల్యూడీ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.14.9 లక్షల ఓటర్లు ఉండగా, 7.35 లక్షల పురుష ఓటర్లు, 7.54 లక్షల మహిళా ఓటర్లు ఉన్నారని, కొత్తగా 52,000 మంది ఓటర్లు నమోదయ్యారని తెలిపారు.ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున ఆదివారం నుండి ఎన్నికల వ్యయం లెక్కలోకి వస్తుందని, ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాల వంటివి నిర్వహించకూడదని తెలిపారు. ఎన్నికలను సక్రమంగా నిర్వహించేందుకు ఎస్ఎస్ టీ, వీఎస్టీ బృందాలను ఏర్పాటు చేశామన్నారు.ఎన్నికలకు సంబంధించి ఏదైనా ఫిర్యాదులను సి-విజిల్ ద్వారా 1950 కు తెలియజేయాలని, ఎన్నికల సక్రమ నిర్వహణకు సుమారు 20 నోడల్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు.ఎస్పీ చందనా దీప్తి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. సమావేశాలు ర్యాలీలకు సువిధ ద్వారా ముందస్తు అనుమతులు తీసుకోవాలని తెలియజేశారు. ఎన్నికల సమయంలో ఎవరైనా రూ.50 వేలకు మించి నగదును తీసుకు వెళ్ళవలసి వస్తే ఖచ్చితమైన ఆధారాలను వెంట తీసుకువెళ్లాలన్నారు.న్నికల సందర్భంగా స్వాధీనం చేసుకున్న నగదును జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసే ఫిర్యాదుల కమిటీ ద్వారా విడుదల చేయడం జరుగుతుందని, సరైన సాక్ష్యాలు చూపించిన తర్వాత విడుదల చేస్తారని తెలిపారు. ఈ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సీసీ కెమెరాలు పెంచడం జరిగిందని, ఎన్నికల్లో శాంతిభద్రతలకు గట్టి బందోబస్తును ఏర్పాటు చేసేందుకు ప్రణాళికను రూపొందించామన్నారు.ఈ సమావేశంలో డీఆర్‌ఓ డి.రాజ్యలక్ష్మీ, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, సమాచార శాఖ సహాయసంచాలకులు యు. వెంకటేశ్వర్లు, మీడియా రిలేషన్స్ నోడల్ అధికారి, ఇండస్ట్రీస్ జీఎం కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రింటింగ్‌ప్రెస్ యజమానులు నిబంధనలు విధిగా పాటించాలి

ఎన్నికల సందర్భంగా ప్రచార నిమిత్తం ప్రచురించే కరపత్రాలు, గోడ పత్రికల విషయంలో ప్రచురణకర్తలు, ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 లోని నియమ, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికల ప్రచారానికి సంబంధించి ఆయా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచురించే కరపత్రాలు, గోడ పత్రికల ముద్రణకు సంబంధించి ఎన్నికల నిబంధనల పాటించాల్సి ఉంటుందని తెలిపారు.ఎన్నికల పోస్టర్లు, కరపత్రాలపై పబ్లిషర్, ప్రింటర్ పేరు, ముద్రించిన ప్రతులు, ఫోన్ నెంబర్‌తో సహా ప్రచురించాలని, యజమానులు ప్రచురణ కర్త ద్వారా ఒక డిక్లరేషన్ తీసుకోవాలని, ఆ డిక్లరేషన్‌లో ప్రచురణకర్త వారికి తెలిసినట్టుగా మరో ఇద్దరు అటెస్ట్ చేసి ఉండాలని పేర్కొన్నారు. ముద్రించిన పోస్టర్లు, కరపత్రాలకు సంబంధించి వివరాలను ప్రచురించిన 3 రోజుల్లో జిల్లా ఎన్నికల అధికారికి అనేక్షర్ ఏ,బీతోపాటు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. డిక్లరేషన్లో పేర్కొన్న ప్రతులకు మించి ఎక్కువ కాపీలు ముద్రించడం, పంపిణీ చేయడం వంటివి చేస్తే ప్రజా ప్రతినిధ్య చట్టం 1951, సెక్షన్ 127 కింద కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

28న కోదాడ బార్ అసోసియేషన్ ఎన్నికలు

నవతెలంగాణ-కోదాడరూరల్

కోదాడ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలను ఈనెల 28వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో న్యాయవాదులు పేర్కొన్నారు.రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు నూతన కార్యవర్గ ఎన్నిక కోసం సోమవారం నుండి ఎన్నికల ప్రక్రియ ప్రాంభించనున్నారు.ఎన్నికల ప్రక్రియ నిర్వహణ కోసం సీనియర్ న్యాయవాది వేజెళ్ళ రంగారావును ఎన్నికల అధికారిగా నియమించారు.సహాయఎన్నికల అధికారులుగా న్యాయవాదులు షేక్ జానీపాషా, ఆవుల మల్లికార్జునరావులను నియమిస్తూ బార్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో తీర్మానించారు. ఎన్నికల ప్రక్రియ లో భాగంగా సోమవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి, ఈనెల 19న నామినేషన్ల స్వీకరణ చేపట్టనున్నారు.21న నామినేషన్లు పరిశీలన అనంతరం అదే రోజు సాయంత్రం అర్హత కలిగిన నామినేషన్లు వివరాలు ప్రకటించనున్నారు.22 న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు ఉపసంహరణ గడువు వుందని, అనంతరం సాయంత్రం ఐదు గంటలకు పోటీలో ఉండే అభ్యర్థుల వివరాలు ప్రకటించనున్నారు.ఈనెల 28వ తేదీన ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ నిర్వహించి, మధ్యానం 3 గంటల నుండి కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించి, గెలుపొందిన వారికి వివరాలు ప్రకటించనున్నారు.ఈ ఎన్నికల ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు తమకు సహరించాలని ఈ సందర్భంగా ఎన్నికల అధికారులుగా నియమితులైన ప్రధాన ఎన్నికల అధికారి వేజెళ్ల రంగారావు, సహాయ ఎన్నికల అధికారులు షేక్ జానీపాషా,ఆవుల మల్లికార్జున్ కోరారు.

ఐఎన్‌టీయూసీ బలోపేతానికి కృషి : ఎమ్మెల్యే

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఐఎన్‌టీయూసీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తానని శాసనసభ్యులు వేముల వీరేశం పేర్కొన్నారు. ఆదివారం హోటల్ వివేరాలో ఆర్టీసీ రీజినల్ స్థాయి ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఐఎన్‌టీయూసీ ఆర్టీసీ కార్మిక సంఘం బలోపేతానికి తాను ఎప్పుడూ ముందుంటానన్నారు. నార్కట్‌పల్లి బస్ డిపోను పునరుద్ధరించేందుకు ఇప్పటికే కసరత్తు మొదలెట్టినట్టు చెప్పారు.త్వరలోనే డిపోలో 30 బస్సులతో పూర్వవైభవం తీసుకొస్తామన్నారు.అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సయ్యద్‌మహమ్మద్, హనుమంతుముదిరాజ్, జిల్లా నాయకులు చంద్రయ్య కత్తులయాదయ్య, రుద్రోజు శేఖర్, మండల నాయకులు బోయపల్లి శ్రవణ్‌గౌడ్, నడింపల్లిమల్లేష్, పైళ్ళ శేఖర్‌రెడ్డి, ముద్దంవెంకన్న, జాన్‌రెడ్డి, కాంగ్రెస్ మండలఅధ్యక్షుడు బత్తుల ఊషయ్యగౌడ్,మాజీ జెడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య పుల్లెంలఅచ్చాలు, సట్టు సత్తయ్య,బండసాగర్‌రెడ్డి,నేతగానికృష్ణ, శశిధర్‌రెడ్డి, సత్యనారాయణ, సమద్, పృథ్వీ పాల్గొన్నారు.

5

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రిభువనగిరి

సోమవారం | మార్చి 18, 2024 | www.navatelangana.com



ప్రజావాణి కార్యక్రమం రద్దు

నవతెలంగాణ-భువనగిరి

పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినందున ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హనుమంత్ కే జండగే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని దృష్టిలో ఉంచుకొని ఈనెల 18న నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసే వరకు అనగా వచ్చే జూన్ 6వ తేదీ వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరగదని, ప్రజలు దీనిని దృష్టిలో ఉంచుకోవాలని ఆయన ప్రకటనలో కోరారు.



పేదలు ధనికులు కావడమే ఎజెండా

- మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్

నవతెలంగాణ-ఆలేరుటౌన్

పేద ప్రజలు ధనికులు కావడమే తన ఎజెండా అని భువనగిరి మాజీ పార్లమెంటు సభ్యులు, బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఓటు బ్యాంకు ద్వారానే అట్టడుగు వర్గాల ప్రజలని ధనికులుగా మార్చే విధంగా కృషి చేయవచ్చని చెప్పారు. కేవలం బీసీ విధానం కాదని, అన్ని వర్గాల ప్రజలు, వెనుక బడిన అన్ని వర్గాల ప్రజలు వృద్ధి చెందాలని, ఏబిసిడి తన ఫిలాసఫి కాదన్నారు. తన దృష్టిలో రెండే రెండు కులాలు ఉన్నాయని లేనోడు, ఉన్నోడని అన్నారు. లేనోడిని ఉన్నోడిగా మార్చాలనే సంకల్ప బలంతో ముందుకు వెళ్తానన్నారు. ఈ విషయాన్ని ప్రతి రాజకీయ నాయకుడు స్వీకరించాలని కోరారు. సాధ్యాసాధ్యాలను పక్కన పెడుతూ దృఢ సంకల్పంతో ముందుకు వెళ్తానన్నారు.

భక్తులకు మరింత చేరువైన వెంకటేశ్వరుడు

- తిరుపతి దేవస్థాన ప్రధానాచార్యులు
- వైభవంగా వెంకటేశ్వరుని ప్రాణప్రతిష్ట
- వేల సంఖ్యలో భక్తుల సందడి
- పూర్ణ వచనం హోమాలలో భక్తిమయం





నవతెలంగాణ-ఆలేరు

కలియుగ దైవం వెంకటేశ్వరుడు ప్రజలకు మరింత చేరువయ్యాడని తిరుమల తిరుపతి దేవస్థాన ప్రధాన ఆచార్యులు వేణుగోపాల దీక్షితులు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలంలోని రేణిగుంట గ్రామంలో ఆదివారం శ్రీ సంకల్ప సిద్ధి వెంకటేశ్వరుని ప్రతిష్టతోపాటూ శ్రీదేవి భూదేవి మూర్తులను తిరుమల తిరుపతి దేవస్థాన ప్రధాన ఆచార్యులు వేణుగోపాల దీక్షితులు మరియు శ్రీనివాస దీక్షితులు పాల్గొని శాస్త్ర యుక్తంగా వేలాది భక్తుల సమక్షంలో గోవిందనామ సంకీర్తలతో ప్రతిష్ఠింపజేశారు. రెయిన్బో అగ్రి ఫార్మ్స్ సిఎండి సూది రెడ్డి కళావతి నాగిరెడ్డి ఆధ్వర్యంలో అత్యంత భక్తి శ్రద్ధలతో వేలాది మంది భక్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు.తిరుపతిలో ఉన్న భావన కలిగే విధంగా విగ్రహ రూపాలు గోపురాలు శ్రీ వెంకటేశ్వర స్తోత్రాలు వచ్చిన భక్తులను భక్తి పారవశ్యములో మునిగితేలే విధంగా ఏర్పాట్లు చేయబడ్డాయి. హైదరాబాదు నగరానికి చేరువలో ఈ ఆలయం నిర్మాణం కావడంతో వేల సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. రాష్ట్ర నలుమూల నుండి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరైనారు. కళావతి నాగిరెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాల కష్టం నేటి కార్యక్రమం ద్వారా ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. ప్రధాన ఆచార్యులు వేణుగోపాల దీక్షితులు, అస దీక్షితులు హాజరు కావడం వారి చేతుల మీదుగా వేద మంత్రాల ద్వారా సంకల్ప సిద్ధి వెంకటేశ్వరుని శ్రీదేవి భూదేవి విగ్రహ ప్రతిష్ట జరగడం ఈ ఆలయానికి ఎనలేని వైభవం చేకూరిందన్నారు. రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన భక్తులు పూర్ణ వచనం హెూమాలలో వేద పండితుల మంత్రోచ్చరణ తో అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమం పాల్గొన్న అందరికీ మంచి జరగాలని తాను వేడుకున్నట్లు చెప్పారు సుమారు పదివేల పైగా మంది భక్తులు హాజరైనప్పటికీ అందరికీ సరిపోను అన్నదాన కార్యకమం సజావుగా సాగడం బాలింతర్ల కృషి ఎంతో ఉందన్నారు, ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమం ఉంటుందని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శించుకునిదేవస్థానం నుండి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర ఆలయాన్ని దర్శించుకుని పునీతులవ్వాలన్నారు, రేణిగుంట నుండి కొలనుపాక లోని శతాబ్దాల కాలం నాటి సోమేశ్వర ఆలయం ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన జైన మందిరం దర్శించుకుని ఆలేరులోని కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని భక్తులు తిరుగు ప్రయాణం చేసినట్లయితే భక్తులకు సంపూర్ణ దైవ దర్శన భాగ్యం కలుగుతుందన్నారు, ప్రతి సంవత్సరం స్వామి వారి ఉత్సవాలు, కళ్యాణం కార్యక్రమం ఉంటుందని చెప్పారు నేడు సోమవారం సుప్రభాత సేవ తోరులార్చన బాల భోగ నివేదన అలంకారాసనం కల్యాణోత్సవ ముగింపు ఆశీర్వచనం ఉంటుందన్నారు ఈ ఉత్సవాలలో రెయిన్బో అగ్రి ఫామ్ డైరెక్టర్లు కూర కళ్యాణి బద్రీనాథ్ కుంభాల శోభారాణి ఎల్లారెడ్డి జులా రాఘవేంద్ర సమ్మెట వెంకట రాజేశ్వరి శ్రీనివాస్ రావులతోపాటు మండలంలోని మండలంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు

డబుల్ రోడ్డుకు రూ.16 కోట్లు మంజూరు



నవతెలంగాణ-చిలుకూరు

మండల కేంద్రం నుండి బేతవోలు జెర్రిపోతులగూడెం వరకు రోడ్డును డబుల్ రోడ్డుగా మంజూరు చేయాలని ప్రభుత్వం రూ.16 కోట్లు మంజూరు చేసింది.ఈ నిధులు మంజూరైన సందర్భంగా పలు రాజకీయ పార్టీలు పలు రకాలుగా మావల్లనే నిధులు మంజూరయ్యాయని గొప్పలు చెప్పుకుంటున్నారు తప్ప చేసిందేమీ లేదు.ఈ రోడ్డు నిర్మాణం చేయాలంటే రెండు నియోజకవర్గాలైన కోదాడ- మిర్యాలగూడ మధ్య ఉండడంతో నిధుల మంజూరు విషయంలో జాప్యం జరిగినది. మండలంలోని కొండాపురం, మాధవగూడెం, బేతవోలు జెర్రిపోతులగూడెం, కొమ్ముబండతండా, ఆచార్లగూడెం, పోలేనిగూడెం, చిన్నారిగూడెం గ్రామాలు మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. మిగతా గ్రామాలు కోదాడ నియోజకవర్గం పరిధిలో ఉన్నాయి. ఈ రోడ్డు నిర్మాణం డబుల్ రోడ్డుగా చేయాలని ఆనాటి సీపీఐ(ఎం) మిర్యాలగూడ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డికి నాడు సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వట్టికూటి నాగయ్య, సీనియర్ నాయకులు వేనేపల్లి వెంకటేశ్వరరావు,సీపీఐ నుండి తాళ్లూరి శ్రీను, బెజవాడ వెంకటేశ్వర్లు డబుల్ రోడ్డు నిర్మాణం చేయాలని పలు వినతిపత్రాలు ఇవ్వడంతో డబుల్ రోడ్డు నిర్మాణం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.అనంతరం కొద్దికాలంలోనే మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో ఉన్న గ్రామాలు కోదాడ నియోజకవర్గానికి మార్చడంతో మంజూరయ్యే విషయంలో రోడ్డు నిర్మాణం ఆగిపోయినది. విషయం మళ్లీ మొదటికి రావడంతో సీపీఐ(ఎం),సీపీఐల ఆధ్వర్యంలో పలుమార్లు ధర్నాలు, రాస్తారోకోలు వినతిపత్రాలు ఇచ్చుకుంటూ వస్తున్న క్రమంలో ఒకపక్క రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ఉధృతంగా కొనసాగుతున్న సమయంలో మండలంలో ఉన్న పెద్ద నాయకులంతా బీఆర్ఎస్‌లో చేరినప్పటికీ రోడ్డు నిర్మాణం మంజూరు చేయించలేక విఫలమయ్యారు. 2023 నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు వస్తున్న సమయంలో బీఆర్ఎస్‌లో ఉన్న బజ్జూరి వెంకటరెడ్డి, కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో బేతవోలులో నిర్వహించిన కాంగ్రెస్ సమావేశంలో కాంగ్రెసులో చేరి ఎంపీకి ఈ రోడ్డు నిర్మాణం చేయాలని కోరగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. బేతవోలు నుండి కొండాపురం, మాధవగూడెం, ముకుందాపురం వరకు రోడ్డు నిర్మాణం కోసం సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు వేనేపల్లి వెంకటేశ్వరరావు ఎన్నో దఫాలుగా వినతిపత్రాలు ఇస్తూ రాస్తారోకోలు చేస్తున్న క్రమంలో బీఆర్ఎస్ అధికారంలో మూడున్నర కోట్ల రూపాయలు మంజూరు కావడంతో రోడ్డు నిర్మాణ పనులు పూర్తికావొస్తున్నాయి.కోదాడ నుండి రామాపురం, ఆర్లగూడెం, కొత్త కొండాపురం, పాత కొండాపురం వరకు రోడ్డు నిర్మాణం చేయాలని ఎస్ఎస్పీ కాల్వకట్టపై నూతన బిడ్జి నిర్మాణం చేయాలని బీఆర్ఎస్ ఆనాటి ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యను ముత్యాలకాల్వ, రెడ్లకుంటతూము మేజర్ కాల వవద్దకు పిలిపించి నిధులు మంజూరు చేయాలని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు వేనేపల్లి వెంకటేశ్వరరావు కోరారు.ఎమ్మెల్యే చేస్తానని హామీ ఇచ్చి చేయలేదు. ఈ విషయం ఆయా గ్రామాల ప్రజలకు తెలిసిన విషయమే. నేడు ఇదే రోడ్డు నిర్మాణం కోసం ప్రస్తుత ఎమ్మెల్యే ఉత్తం పద్మావతిని కలిసి వినతిపత్రం అందించిన సందర్భంగా నిర్మాణం చేస్తానని హామీ ఇచ్చారు.వివిధ పార్టీల నాయకులు మేము ముందే వినతిపత్రం ఇచ్చామని నిధులు మంజూరు చేస్తామన్నారని నేడు గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉన్నది.ఆనాడు బీఆర్ఎస్ ఎమ్మెల్యే వచ్చినాడు ఎక్కడ ఉన్నారు.. ఈ నాయకులు ఏం చేశారని ఆయా గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. సీతారామపురం నుండి నారాయణపురం,శీత్లాతండా, దూదియాతండా, జానకినగర్ గ్రామాల మీదగా కోదాడ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు బీఆర్ఎస్ అధికారంలో ఉన్న నాటి నుండి నేటి వరకు వినతి పత్రాలు ప్రతిపాదనలు ఇస్తూ వస్తున్నారు. అయినా మంజూరు విషయంలో జాప్యం జరుగుతున్నది. బేతవోలు నుండి చెన్నారిగూడెం, ఆచర్లగూడెం వరకు రోడ్డు నిర్మాణం చేయాలని ఆనాడు సీపీఐ(ఎం) నాయకులు మొలుగూరి నాగరాజు ఆధ్వర్యంలో పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ మంజూరు చేయడంలో అధికార పార్టీ వారు విఫలం అవుతున్నారు. బేతవోలు, చెన్నారిగూడెం మధ్య రాములకుంట చెరువు కట్టమీదగా ప్రయాణం చేయాలి. గతంలో చెరువు కట్టమీదగా ప్రయాణం చేస్తున్న కూలీల ట్రాక్టర్ చెరువులో పడి ఎనిమిది మంది చనిపోవడంతో నాడు అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ కోదాడ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని మృతులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపి ఈ రోడ్డును చెరువు కట్ట కిందగా వెంటనే నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చి నేటి వరకు హామీ హామీగానే మిగిలిపోయింది.ఆ గ్రామాలలో ఉన్న పెద్ద నాయకులు తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు ఉండి అనంతరం బీఆర్ఎస్ పదేండ్లు అధికారంలో ప్రజాప్రతినిధులుగా వివిధహోదాలలో కొనసాగుతున్నప్పటికీ రోడ్డు నిర్మాణం చేయడంలో విఫలమవుతున్నారు. నాటి నుండి నేటి వరకు నిత్యం అదే రోడ్డుపై రాకపోకలు కొనసాగుతున్నారు. ప్రజలు నిత్యం ఆ చెరువు కట్టపై ప్రయాణాలు చేసేటప్పుడు భయాందోళనలకు గురవుతున్నారు. అయినా పట్టించుకునేనాథుడే లేడు. ఇష్టం వచ్చినట్లుగా ఎవరికి తోచినట్లుగా వారు అధికారం కోసం పార్టీలు మారి మేమే చేస్తున్నామని గొప్ప గొప్ప మాటలు మాట్లాడుకోవడం తప్ప వాస్తవంగా చేసిందేమీ లేదనే విషయం తెలుసుకొని మాట్లాడాలని సీపీఐ(ఎం), సీపీఐ పార్టీలు చేసిన ఫలితాల మూలంగానే మండలంలోని అన్ని రోడ్లకు నిధులు మంజూరై అభివృద్ధి చెందుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ప్రయాణికులు. వాహనదారులు. గ్రామ స్థాయి నాయకులు ,అన్ని గ్రామాల పెద్దలు, ప్రతిపక్షంలో ఉన్న నాయకులు చర్చించుకుంటున్నారు.



అండర్ గ్రౌండ్ డ్రయినేజీని పూర్తి చేయాలి

- సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి ఎంఎ ఇక్బాల్

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు మున్సిపాలిటీలో అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ నిర్మాణ పనులను పూర్తి చేయాలని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి ఎంఎ ఇక్బాల్ అన్నారు. ఆదివారం ఆలేరు పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలోని మహాలక్ష్మి రైస్ మిల్, ఆయిల్ మిల్ నుండి శివాలయం వరకు ఉన్న మురికి కాల్వలను సీపీఐ(ఎం) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పరిశీలన చేసి మాట్లాడారు. మురికి కాలువలు శిథిలావస్థకు చేరాయని, పూడిక సరిగా తీయకపోవడం వలన కాలువలోని నీరు ఇళ్లలోకి వచ్చే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. 20 నుంచి 30 ఏండ్ల క్రితం నిర్మించిన మురుగు కాలువలు కూలిపోవడం వలన నీరు ప్రవహించలేని పరిస్థితిలు వచ్చాయన్నారు. ఆయిల్ మిల్ దగ్గర మురికి కాలువ నిర్మించినప్పటికీ మిగతా కాలువలతో లెవెల్ పరిశీలన చేయకపోవడం వలన ప్రధాన కాలువగా ఉన్న ఈ కాలువ చుట్టూ ఉన్నటువంటి మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోయిందని పేర్కొన్నారు. అధిక శాతం దళితులు వెనుకబడ్డ వర్గాల వారు నివసిస్తున్నటువంటి ఇలాంటి కాలనీలను నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. అధికారులు తమ తీరు మార్చుకోవాలని ఈ సందర్భంగా ఆయన హితవు పలికారు. సుభాష్ నగర్ మహాలక్ష్మి రైస్ మిల్ ఆయిల్ మిల్ నుండి శివాలయం వరకు ఉన్న మురికి కాలువను యుద్ధ ప్రాతిపదికన అండర్ గ్రౌండ్ డ్రైనేజీగా నిర్మించాలని ,మున్సిపల్ పాలకవర్గం సమస్యలను పరిష్కరించడంలో విఫలమైనందున జిల్లా కలెక్టర్ స్పందించి ఇక్కడి ప్రజల సమస్యను పరిష్కరించాలన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు మోరిగాడి రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జూకంటి పౌలు, తాళ్లపల్లి గణేష్, చింతల నాగరాజు ,బోనగిరి గణేష్, మొగిలి పాక కృష్ణ , దండు నాగరాజు, బొడ్డు కుమార్, బొడ్డు శివ, వినోద్ ,చింతల చింటూ, మొగిలి పాక నరసింహులు, విజయేందర్, నరసింహులు, ముక్క నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

10వ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- 718 మంది విద్యార్థులు, 04 కేంద్రాలు



నవతెలంగాణ-పెద్దవూర

మండలంలో నేటినుంచి ప్రారంభం కానున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈఓ బాలునాయక్ తెలిపారు. పరీక్షల నిర్వహనకు పెద్దవూర మండల కేంద్రంలో రెండు, నాగార్జున సాగర్‌లో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. వారి కోసం పెద్దవూర మండలంలో 04 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. స్థానిక జెడ్‌పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో 240మంది, న్యూ కిడ్స్ ఉన్నత పాఠశాల లో169మంది, అలాగే నాగార్జున సాగర్ మున్సిపాలిటీలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. సెంట్ జోషఫ్, పాఠశాల లో 170, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 139 మొత్తం 718 మంది పరీక్షలు రాయనున్నారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీలో ఉచితంగా ప్రయా ణించేందుకు ప్రభుత్వం వీలుకల్పించింది. పరీక్షకు వచ్చేటప్పుడు, పరీక్ష ముగిసిన తర్వాత ఇళ్లకు వెళ్లేటప్పుడు తమ హాల్ టిక్కెట్లు చూపి ఉచితంగా ప్రయాణించవచ్చు. దివ్యాంగులకు అవసరమైతే స్క్రైబ్‌ను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

23న మాల మహానాడు ఉమ్మడి జిల్లా కార్యకర్తల సమావేశం

నవతెలంగాణ-నల్లగొండకలెక్టరేట్

ఈనెల 23న మాల మహానాడు ఉమ్మడి జిల్లా కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు మాల మహానాడు జిల్లా అధ్యక్షులు లకుమాల మధుబాబ తెలిపారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని శాంతినగర్ గల మాల మహానాడు జిల్లా కార్యాలయంలోఆయన విలేకర్లతో మాట్లాడారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య, రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ హాజరవుతున్నారని తెలిపారు.సమావేశానికి రాష్ట్ర, జిల్లా డివిజన్, నియోజకవర్గ ఇన్‌చార్జిలు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

సాయికిరణ్ జ్ఞాపకార్థం వృద్ధాశ్రమానికి బియ్యం అందజేత



నవతెలంగాణ-భువనగిరి

గత నాలుగు సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించిన వెలువర్తి సాయికిరణ్ జ్ఞాపకార్థం ఆదివారం మండలంలోని రాయగిరి సహృదయ అనాథ వృద్ధాశ్రమంలో 50 కిలోల బియ్యం, పండ్ల పంపిణి సోదరుడు డిఎస్పి జిల్లా కమిటి సభ్యుడు వెలువర్తి శ్రీకాంత్ మహారాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం లాగ ఈ సంవత్సరం వృద్ధాశ్రమంలో బియ్యం పంపిణి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు లక్ష్మమ్మ మదు, రాంబాబు, శివశంకర్, వృద్ధాశ్రమ నిర్వహకులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు పగడ్బందీగా ఏర్పాట్లు

- మండలంలో మూడు పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- పరీక్షలు రాయనున్న 640 మంది విద్యార్థులు

నవతెలంగాణ-తిరుమలగిరి

మండలంలో ఈనెల 18వ తేదీ నుంచి జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి ఇట్టమల్ల శాంతయ్య తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో మొత్తం 640 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. మండల కేంద్రంలో జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 240 మంది విద్యార్థులు, ఫాతిమా ఇంగ్లీష్ మీడియం స్కూల్లో 200 మంది, కృష్ణవేణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ 200 మంది విద్యార్థులు హాజరవుతున్నట్టు తెలిపారు.పరీక్ష సమయం ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:30 వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు.విద్యార్థులందరూ ఉదయం 8:30 వరకు పరీక్షాకేంద్రాల్లోకి చేరుకోవాలని సూచించారు.పరీక్షాకేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.ఈ కార్యకమంలో అన్ని పరీక్షాకేంద్రాల సీఎస్, డీఓలు తదితరులు పాల్గొన్నారు.

పూర్వవైభవం దిశగా మోత్కూరు అంగడి

నవతెలంగాణ-మోత్కూర్

మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో ఏళ్లుగా నడుస్తున్న అంగడిని మూసేయగా తిరిగి ఇటీవల పునరుద్ధరించడంతో అంగడి పూర్వ వైభవం దిశగా ఎప్పటిలానే ఆదివారం సంతను నిర్వహించగా రైతులు పశువులు, మేకలు, గొర్రెలను క్రయవిక్రయాల కోసం తోలుకొచ్చారు. అంగడికి గత వైభవం తీసుకరావడానికి నూతనంగా చైర్మన్ బాధ్యతలు చేపట్టిన గుర్రం కవితలక్ష్మీ నర్సింహారెడ్డి పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి సారించడంతో మున్సిపాలిటీఆధ్వర్యంలో గ్రామాల్లో ముమ్మర ప్రచారం సైతం నిర్వహించారు. సంతలో రైతులకు ఇబ్బందులు లేకుండా మున్సిపల్ కమిషనర్ సి. శ్రీకాంత్, కాంగ్రెస్ లీడర్లు డాక్టర్ జి.లక్ష్మీ నర్సింహారెడ్డి, పన్నాల శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సంత ఎప్పటిలాగే నడుస్తుందని, మీ గ్రామాలతో పాటు పరిసర గ్రామాల రైతులకు చెప్పాలని కోరారు. కూరగాయలు, ఇతర చిరు వ్యాపారులు ఎక్కువగా వచ్చి సంతలో తమ దుకాణాలు నిర్వహించారు.



'కాంగ్రెస్‌తో అన్ని సామాజిక వర్గాలకూ న్యాయం'

నవతెలంగాణ-భువనగిరి

కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరుగుతుందని భువనగిరి నియోజకవర్గ ఎస్టీ నాయకులు అన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఎస్టీ గిరిజన విభాగం కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ బెల్లయ్య నాయక్‌కి ఆదివారం ఆదివాసి గిరిజన విభాగం జిల్లా మండల అధ్యక్షులు ఆదివారం రోజు హబ్సిగూడ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ రాములు నాయక్ బీబీనగర్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు మూడవత్ రాజేందర్ నాయక్ బోనగిరి ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు బుక్య రమేష్ నాయక్ బి.ప్రేమ్ కుమార్ యూత్ ప్రెసిడెంట్, బి.విజయ్ నాయక్, బి.రెడ్డి, బి.మధు నాయక్, డా.లింగా నాయక్ పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ గిరిజన సెల్ ఆధ్వర్యంలో భువనగిరి జిల్లా గిరిజన కాంగ్రెస్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర గిరిజన ఆదివాసి రాష్ట్ర అధ్యక్షులు తేజావత్ బెల్లయ్య నాయక్‌కి గిరిజన కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్మెంట్స్ కార్పొరేషన్ చైర్మెన్‌గా నియామకమైన సందర్భంగా వారికి తన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆదివాసి గిరిజన సెక్రటరీ రాజు నాయక్ అన్ని మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు మాన్య నాయక్ క్రాంతి నాయక్ పాట్టు నాయక్ నరసింహ నాయక్ రాజేందర్ నాయక్ రమేష్ నాయక్ పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



నవతెలంగాణ-కోదాడరూరల్

డివిజన్ పరిధిలోని అనంతగిరి,చిలుకూరు, మునగాల,నడిగూడెం మండలాల్లో నేటి సోమవారం నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆ మండల విద్యాధికారి సలీం షరీఫ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదు మండలాల్లో 17 సెంటర్లలో మొత్తం 3285 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానునట్టు తెలిపారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 1715, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు 1570 ఉన్నట్లు పేర్కొన్నారు. మండలాల వారీగా కోదాడ మండలంలో 17 ప్రభుత్వ పాఠశాలలు 26 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయన్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల నుండి 656 మంది విద్యార్థులు, ప్రయివేట్ పాఠశాలల నుండి1442 విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్టు తెలిపారు. 10 పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.అనంతగిరి మండలంలో ఏడు ప్రభుత్వ పాఠశాలల నుండి 197 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్టు తెలిపారు. అనంతగిరి మండలంలో ప్రయివేట్ పాఠశాలలు లేవని మొత్తం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులేనని వీరిలో సగం మంది త్రిపురవరం సెంటర్‌లో మిగతావారు కోదాడ సెంటర్లలో పరీక్షకు హాజరు కానునట్టు తెలిపారు. నడిగూడెం మండలంలో 11 ప్రభుత్వ పాఠశాలలు ఒక ప్రైవేట్ పాఠశాల ఉందని వీటిలో ప్రభుత్వ పాఠశాలల నుండి 310 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల నుండి ఆరుగురు విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్టు తెలిపారు. నడిగూడెంలో రెండు పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.చిలుకూరు మండలంలో ఎనిమిది ప్రభుత్వ పాఠశాలలు ఒకటి ప్రయివేట్ పాఠశాల ఉందని ప్రభుత్వ పాఠశాలల నుండి 255 మంది విద్యార్థులు ప్రయివేట్ పాఠశాల నుండి 68 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు తెలిపారు. చిలుకూరు మండలంలో రెండు పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రతి పరీక్షాకేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్ డిపార్టుమెంట్ అధికారి ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను నియామకం చేసినట్టు తెలిపారు.పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

వైభవంగా జలబిందెల గ్రామోత్సవం



నవతెలంగాణ-కోదాడరూరల్

పట్టణంలోని కోదండ రామాలయం పునర్నిర్మితమై పలు దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం శనివారం ప్రారంభమైంది. రెండవ రోజైన ఆదివారం సీత లక్ష్మణ సమేత శ్రీ కోదండ రాముడు, అన్నపూర్ణ సమేత బోలాలింగేశ్వర స్వామి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి, శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీకృష్ణుడు తదితర దేవతామూర్తుల విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.జలాభిషేక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు నాగుబండి.రంగా, నాగుబండి. రంగనాథ్, నందగోపాల్, అరవింద్ ప్రతిష్ఠ నిర్వహణ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.